

ఉష్ణోగ్రత (అంచనా) 21-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	34	27
తెనాలి	34	26
నరసరావుపేట	34	26
బాపట్ల	34	27
రెంటచింతల	34	26
చీరాల	34	27



డోర్ డెలివర్రీకి.. చెల్లుచీటి!

- ఇంటింటికీ సరుకుల పంపిణీ నిలిపివేత
- క్యాబినెట్ కమిటీ నిర్ణయంతో పాత పద్ధతికి స్వస్తి
- ఇకపై చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ

గుంటూరు, మే 20(ఆంధ్రజ్యోతి): గత కొంత కాలంగా ఎండీయూ వాహన సరఫరా విధానాన్ని రద్దు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ చెబుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ- క్యాబినెట్ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. సమావేశ అనంతరం వినియోగ దారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి ప్రస్తుతం అమలులో ఉన్న మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల ద్వారా సరుకులను పంపిణీ చేసే విధానాన్ని నిలిపివేస్తూ, గతంలో మాదిరిగానే చౌక ధర దుకాణాల ద్వారా నేరుగా సరుకులను పంపిణీ చేసే విధానాన్ని పునరుద్ధరించేందుకు వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌర సరఫరాల శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపిందని వివరించారు.

ఎండీయూపై ప్రజల్లో విముఖత

రేషన్ కార్డుదారులు ఇచ్చిన ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ ప్రకారం 25% మందికి నిత్యావసర సరుకులు అందకపోవడం, 26% మంది ఎండీయూ ఆపరేటర్లు అధిక ధరలు వసూలు చేయడం వంటి ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. దీంతో ప్రజల్లో విముఖత పెరిగింది. ప్రతి ఎండీయూ మూడు రేషన్ షాపులను ఇవ్వగా వారు నెలలో 15-17 రోజుల్లో మాత్రమే కవర్ చేస్తున్నారు. దీంతో కార్డుదారులకు సరుకులు అందడం లేదు. వాటిని దారి మళ్లించడంపై 288 కేసులు నమోదయ్యాయి. దీనికి తోడు రాష్ట్ర వ్యాప్తంగా 570 మంది ఆపరేటర్ల కొరత ఉంది. దీనికి తోడు ఈవిధానం కారణంగా ప్రభుత్వంపై రూ.353.81 కోట్ల అదనపు భారం పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

డోర్ డెలివరీతో వర్రీ..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో మొత్తం 17,30,835 మంది కార్డుదారులు ఉన్నారు. వారికి 3,384 రేషన్ షాపులు అందుబాటులో ఉన్నాయి. అయితే గత ప్రభుత్వం డోర్ డెలివరీ పేరుతో జిల్లాలో 850 ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. ఈ విధానం ప్రజల కష్టాలను తగ్గించకపోగా మరింత పెంచింది. కూలీ, నాలీ చేసుకునే నిరుపేద, దిగువ మధ్యతరగతి ప్రజలకు రేషన్ సరుకులే ఆధారం. గతంలో కూలీ పనులకు వెళ్లి వచ్చి సమీపంలో ఉన్న రేషన్ షాపుల్లో సరుకులు తెచ్చుకునేవారు. డోర్ డెలివరీ విధానంలో ఎండీయూ వాహనం తమ ఇంటికి వచ్చే రోజు కోసం కార్డుదారులు ఎదురు చూడాల్సి వచ్చేది. వాహనం వచ్చిన రోజు ఇంటి దగ్గర ఉంటే అదృష్టం.. లేదంటే ఇక అంతే! ఆ కారణంగా లబ్ధిదారులు పనులు మానుకుని ఇళ్లదగ్గర ఉండాల్సి వచ్చేది. దీంతో వారు పనిదినాలు నష్టపోయి, ఆదాయాలు తగ్గిపోయాయి. ఎండీయూ తమ వీధికి వచ్చినా, ఆ రోజు కోటా అయిపోతే మళ్లీ వారు మరుసటి రోజు కూడా పని మానుకుని ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనికి తోడు మండు టెండలో రోడ్ల మీద ఎండీయూ వాహనాల దగ్గర గంటల తరబడి నించోవాల్సి వచ్చేది. దీంతో ఎండీయూ విధానం రద్దుచేయాలన్న డిమాండ్ గత కొంత కాలంగా బలంగా ముందుకు వచ్చింది. తాజాగా కేబినెట్ తీసుకున్న నేపథ్యంలో కార్డుదారులకు ఈ కష్టాలు తప్పినట్లే!

ప్రభుత్వం వరమిచ్చినా.. కరుణించని సాఫ్ట్‌వేర్



దేవుడు కరుణించినా.. ఎవరో కరుణించ లేదన్న చందంగా మారింది నూతన రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ. రైస్ కార్డును అర్హులైన పేదలకు మరింత చేరువ చేస్తామని సంతోషంగా ప్రకటించిన పౌరసరఫరాల శాఖ దానికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాల్సిన విషయాన్ని మాత్రం మర్చిపోయింది. సర్వర్ సమస్యలతో ఒక్కో దరఖాస్తు అప్‌లోడ్ చేయడానికి రెండు గంటలకు పైగా సమయం పడుతోంది. రోజు మొత్తమ్మీద రెండు మూడుకు మించి దరఖాస్తులు పూర్తి కావడం లేదు. రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియకు ప్రభుత్వం నెల రోజులు గడువు ఇచ్చింది. ఇప్పటికే అందులో రెండు వారాలు పూర్తయ్యాయి.

- రైస్ కార్డు దరఖాస్తుల ఆన్‌లైన్‌లో తీవ్ర జాప్యం
- రెండు గంటలకు ఒక అప్లికేషన్ మాత్రమే పూర్తి
- ఒక్కో సచివాలయంలో 100కు పైగా పెండింగ్
- సాఫ్ట్‌వేర్ పాతదే కావడంతో నిరాశ
- సమస్యాత్మకంగా వివాహ ధ్రువీకరణ పత్రం
- వాట్సప్ గవర్నెన్సూ నిరాశే
- ముంచుకొస్తున్న గడువు గండం

బాపట్ల, మే 20, (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో చేసిన హౌస్ హోల్డ్ సర్వేలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది చేసిన తప్పులు ఇప్పుడు నిజమైన లబ్ధిదారులకు గుదిబండలా మారుతున్నాయి. కేవలం కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేవారికి, పాత కార్డుల్లో పుట్టిన సంతానాన్ని చేర్చుకోవడానికి మాత్రం అవకాశం లభిస్తోంది. మిగిలిన 7 అంశాలకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సచివాలయాల్లో సర్వర్ మొరాయింపు కష్టాలు ఉదయం నుంచి రాత్రి వరకు లబ్ధిదారులను పడిగాపులు కాసేలా చేస్తున్నాయి. గత ప్రభుత్వంలో సవరణలకు అసలు అవకాశమే ఇవ్వకపోవడం, అర్హులైన లబ్ధిదారులను కూడా రాజకీయ కక్షలతో తొలగించడం వంటి కారణాలతో కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి నిరాశ తప్పడం లేదు.

హౌస్‌హోల్డ్ సర్వేలో తప్పులు..

కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేవారికి హౌస్‌హోల్డ్ సర్వే కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. వైసీపీ ప్రభుత్వంలో పేర్ల నమోదు, ఇంటి నంబర్లు తప్పులు వేయడంతో ఇప్పుడు సమస్యలు ఎదురవుతున్నాయి. హౌస్ హోల్డ్ సర్వే వివరాలను డిలీట్ చేయడం, సవరించడం కుదరకపోవడంతో లబ్ధిదారులకు శాపాలుగా మారుతున్నాయి. సర్వేలో లోపాలు సవరించే అవకాశం కల్పిస్తేనే అర్హులకు లబ్ధి చేకూరుతుంది.



పౌర సేవలలో ఒకదానిని ఎంచుకోండి.

పౌర సేవను ఎంచుకోండి

సివిల్ సప్లై సేవలు

సేవను ఎంచుకోండి

Select an option

దీపం స్థితి

రైస్ డ్రా స్థితి

రైస్ ఈకేవైసి స్థితి

రైస్ కార్డు సమర్పణ

వాట్సప్ గవర్నెన్స్ ద్వారా రేషన్ కార్డు దరఖాస్తు చేసుకోడానికి ప్రయత్నిస్తే.. ఆప్షన్స్ కనిపించని పరిస్థితి

పాత సాఫ్ట్‌వేర్‌తో కష్టాలు

పౌరసరఫరాల శాఖ పేదలకందించే రైస్ కార్డుల విషయంలో కొత్తవారికి అవకాశం కల్పించడం, మరో ఏడు అంశాలను సవరించుకునేందుకు వెసులుబాటు కల్పించింది. అయితే దీనికి అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌ను మాత్రం అప్‌డేట్ చేయలేదు. వైసీపీ ప్రభుత్వ కాలంలో విధించిన షరతులే ఇప్పుడూ వర్తిస్తున్నాయి. ఆరు అంచెల తనిఖీ విధానానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. రేషన్ కార్డు కోసం గత ప్రభుత్వంలో భూములు, వాహనాల విషయంలో పరిమితులు, విద్యుత్ వినియోగం యూనిట్‌ల పరిమితి వంటి వాటి ఆధారంగానే తీసుకున్న లబ్ధిదారుల అర్హతను ఇప్పుడూ నిర్ధారిస్తున్నారు. గతంలో కార్డుల్లో కోత విధించేందుకు వైసీపీ సర్కారు అనేక ఆంక్షలు పెట్టి.. చాలా కార్డులను తొలగించింది. దీంతో అర్హత ఉన్నా, చాలామంది పేద లు కార్డులు కోల్పోయారు. ఇప్పుడు అటువంటివారు దరఖాస్తు చేసుకుందామని చూస్తే మళ్లీ అవే షరతులు, అవే ఆటంకాలు వారికి రేషన్ కార్డు అందకుండా చేస్తున్నాయి.

వాట్సాప్ గవర్నెన్స్‌లో నో ఆప్షన్స్

కూటమి ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చింది. 95523 00009 నంబర్‌కు కొత్త రైస్ కార్డుకు సంబంధించి ఏడు రకాల సేవలు అందుతాయని, ఈ నెల 15 నుంచి అందుబాటులో ఉంటుందని ఆ శాఖ ప్రకటించింది. అయితే సేవను ఎంపిక చేస్తే ఇవేమీ రాకుండా, దీపం స్థితి, రైస్ డ్రా స్థితి, రైస్ ఈకేవైసీ స్థితి, రైస్ కార్డు సమర్పణ వంటి కేవలం నాలుగు ఆప్షన్‌లు మాత్రమే వస్తున్నాయి. టోల్ ఫ్రీనంబర్ తెలుసుకుని వారికి కాల్ చేస్తున్నా స్పందన ఉండడం లేదని దరఖాస్తుదారులు చెబుతున్నారు.

- కూచిపూడికి చెందిన ఓ మహిళ భర్తతో విడాకులు తీసుకుంది. ఇద్దరు ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చేసింది. ఇప్పుడు ఆమెకు ఒంటరి కార్డు తీసుకోవాలంటే ఎప్పు డో విడిపోయిన భర్త వచ్చి వేలిముద్ర వేయా లంట.
- 50 ఏళ్లు పైబడి ఒంటరి మహిళలకు కొత్త రేషన్ కార్డు అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, పాత కార్డుల్లో ఉన్నవారికి ఇది వీలుకావడం లేదు. ఏ కార్డులో లేనివారికి అవకాశం లభిస్తోంది.
- నలుగురున్న కుటుంబంలో భార్య చనిపోయింది. ఆమెను డిలీట్ చేయాలని మరణ ధ్రువీకరణ పత్రం జత చేసి దరఖాస్తు చేస్తే, వారి పిల్లల ఆధార్ సీడింగ్ తప్పుగా నమోదైంది. దీంతో సింగిల్ పర్సన్‌ను డిలీట్ చేయటానికి వీలు కావటం లేదు.
- ఒకే రేషన్ కార్డులో అత్త, మామ, కొడుకు, కోడలు నలుగురున్నారు. ఆ కార్డు నుంచి కొడుకు, కోడలిని తొలగించాలంటే కోడలు రిలేషన్ దగ్గర ఎస్‌ఏ అని చూపిస్తోంది. వారి రిలేషన్ చూపడం లేదు. దీంతో వారి డిలీషన్ కూడా కుదరని పరిస్థితి.
- వివాహమైన వారు కొత్తగా రేషన్ కార్డు తీసుకునేందుకు.. వివాహ ధ్రువ పత్రాలు అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. వివాహ నమోదు పత్రం నంబరు, ఫొటో ఇస్తేనే సర్వర్ తీసుకుంటోంది. దరఖాస్తు అప్‌లోడ్ అవుతోంది.

రెండు గంటలకో దరఖాస్తు

రేషన్ కార్డు కోసం సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకుంటే దాని స్థితిని తెలుసుకోడానికే రోజంతా నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దరఖాస్తు ఆన్‌లైన్‌లో పూర్తిచేయాలంటే కనీసం రెండు గంటలు పడుతోంది. ఉదయం 9 గంటలకే సచివాలయాల దగ్గర దరఖాస్తుదారులు క్యూ కడుతున్నారు. గడువు తక్కువగా ఉండటం, ఈలోపే తమ దరఖాస్తు పూర్తిచేసుకోవాలని రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి పోటెత్తడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. సర్వర్ మొరాయించకుండా చేయటం కానీ, గడువు పొడిగించటం వంటి నిర్ణయాన్ని ప్రభుత్వం ప్రకటిస్తేనే ఈ సమస్యకు పరిష్కారం దొరికే అవకాశం ఉంది. సర్వర్ సమస్యతో రోజుకు కేవలం 7 నుంచి 10 దరఖాస్తులు మాత్రమే అప్‌లోడ్ చేయగలుగుతున్నారు.



కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ఇసుక అక్రమాలపై ఉక్కుపాదం

- 2021 నుంచి 2024 వరకు అడ్డగోలు తవ్వకాలు
- జేపి వెంచర్స్ ఏజెన్సీకి షోకాజ్ నోటీసులివ్వాలి
- ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ తవ్వకాలపై, రవాణాపై అధికారులు ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఇసుక అక్రమ తవ్వకాలపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు మరింత పెరగాలని, ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఇసుకరేవుల వద్ద అనుమతులు లేకుండా తవ్వకాలు జరిగితే ఉపేక్షించేదిలేదన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జూన్ నెల నుంచి ఇసుకతవ్వకాల నిషేధం అమలులోకి వస్తుందన్నారు. ఈనేపథ్యంలో రేవు నుంచి వాహనాలు వెళ్ళే రహదార్లను తొలగించాలని ఆదేశించారు. అక్రమ తవ్వకాలకు పాల్పడే వాహనాలను వెంటనే విడిచిపెట్టకుండా భారీగా జరిమానాలు విధించాలన్నారు. 2021 నుంచి 2024 వరకు ఇసుక అక్రమ తవ్వకాలు జరిగినట్లు ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఏపీ సాక్ నివేదిక ఆధారంగా జేపీ వెంచర్స్ ఏజెన్సీకి షోకాజ్‌నోటీసులివ్వాలని ఆదేశించారు. ప్రజల అవసరాల మేరకు ఇసుక రేవును నూతనంగా గుర్తించామని కలెక్టర్ తెలిపారు. జువ్వలపాలెం-2 రేవులో 24.9హెక్టార్లలో ఇసుక లభ్యత అందుబాటులో ఉందన్నారు. ఇక్కడ ఇసుక వినియోగం కొరకు జిల్లాస్థాయి కమిటీ తీర్మానించి ప్రభుత్వానికి నివేదికను పంపుతున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చే వరకు అక్రమ ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం భట్టిప్రోలు ఇసుక రేవులో 12వేల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందన్నారు. అలాగే గాజుల్లంక ఇసుకరేవులో 19వేల మెట్రిక్‌టన్నుల ఇసుక లభ్యత ఉందన్నారు. ప్రజల అవసరాల కొరకు ఇబ్బందులు లేకుండా అన్నిచర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా మైనింగ్ ఏడీ రాజేష్, డీటీవో పరంధామరెడ్డి, కాలుష్య నియంత్రణబోర్డు అధికారి రాఘవేంద్రరావు, బాపట్ల, రేపల్లె ఆర్డీవోలు గ్లోరియా, రామలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఈ సారైనా.. పనులు జరిగేనా!

- కలెక్టరేట్ వేదికగా నేడు మూడో డీఆర్సీ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లా సమగ్రాభివృద్ధిలో అత్యంత కీలకమైన పాత్ర పోషించే డీఆర్సీ సమావేశాలు ఓ దశ, దిశ లేకుండా సాగు తున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఇప్పటికే రెండు సమావేశాలు జరగగా, మూడోది కలెక్టరేట్ వేదికగా ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి అధ్యక్షతన బుధవారం జరగనుంది. డీఆర్సీ సమావేశాలు ఏ దిశగా వెళుతున్నాయి .. అనే దానికి సూచికగా ఏటీఆర్(యాక్షన్ టేకెన్ రిపోర్టు) నిలవనుంది. కానీ, దీనిని ఓ మొక్కుబడి తంతుగా మార్చేసి మమ అనిపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఫలితాలపై దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీని ఫలితమే ఏటీఆర్ రిపోర్టులు పేలవంగా దర్శన మిస్తున్నాయి.

గత డీఆర్సీ..ఏటీఆర్ పరిస్థితి ఇదీ

జిల్లాలో పొగాకు సాగు విస్తీర్ణం ఎంత అనే అంశంతో పాటు కొనుగోలుపై గత డీఆర్సీలో చర్చ జరిగింది. సాగు విస్తీర్ణం గణాంకాలతో పాటు ప్రైవేటు కంపెనీలు పొగాకును కొనుగోలు చేస్తాయని ఏటీఆర్‌లో పొందుపరిచారు. నిజానికి ఇక్కడ ఏటీఆర్ రిపోర్టు ధర విషయంలో రైతాంగానికి చేసిన, చేయబోయే మేలు లేదా తీసుకోవాల్సిన చర్యలను వివరించాల్సి ఉంది. కానీ ఇందుకు భిన్నంగా అంకెలు వల్లెవేయడానికే అధికారులు ప్రాధాన్యమివ్వడం విస్తుగొలిపే విధంగా ఉంది. గత సమావేశాల్లోనే అనధికారికంగా అసైన్డ్ భూముల్లో రొయ్యల సాగు చేపట్టడంపై విస్తృతంగా చర్చ జరిగింది. ఇందుకు సంబంధించిన సమగ్ర నివేదికలు ఇవ్వాలని మత్స్య శాఖను రెవెన్యూ మంత్రి అనగాని ఆదేశించారు. కానీ, ఇప్పటి వరకు వాటిపై చర్యలేంటనే దానికి ఏటీఆర్‌లో సమాధానమే లేదు. డీఆర్సీలో లేవనెత్తే సమస్యల విషయంలో కేవలం 30 శాతం మాత్రమే నిర్మాణాత్మక పరిష్కారానికి నోచుకుంటున్నాయి. మిగిలిన వన్నీ గణాంకాలతోనే నింపేస్తున్నారు.

తొమ్మిది అంశాలతో డీఆర్సీ ఎజెండా ఖరారు

బుధవారం జరగనున్న డీఆర్సీ సమావేశం ఎజెండాలో తొమ్మిది అంశాలను అధికారులు చేర్చారు. ఇరిగేషన్, ఎంఎస్ఎంఈ, తాగునీరు, పర్యాటకం, హౌసింగ్, ఇళ్ల స్థలాల పట్టాలు, డీఆర్‌డీఏ, ఉపాధి హామీ పనులతో పాటు బర్లీ పొగాకు ధర అంశం కూడా డీఆర్సీలో చర్చకు జరగనుంది. ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి మంత్రులు అనగాని, గొట్టిపాటితో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు.

బర్లీ బేల చూపులు

- కొనసాగుతున్న పొగాకు రైతుల కష్టాలు
- అకాల వర్షాలకు మరింత కుదేలు
- 80 శాతం దిగుబడులు అన్నదాతల వద్దే
- గిట్టుబాటు ధర కోసం రైతు పోరుబాట
- నేటి డీఆర్సీలో బర్లీ కష్టాలపై కీలక చర్చ

(బాపట్ల, పర్చూరు-ఆంధ్రజ్యోతి)

బర్లీ పొగాకు రైతుల కడగండ్లు కొనసాగుతూనే ఉన్నాయి. దిగుబడులను కొనే దిక్కు లేక రైతులు బేలగా ప్రభుత్వం వైపు చూస్తూనే ఉన్నారు. ప్రభుత్వం తీసుకుం టున్న చర్యలేవీ కూడా క్షేత్రస్థాయిలో ఫలితాలు చూపించడం లేదు. గడచిన వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు బర్లీ రైతును మరింతగా కుంగదీశాయి. నిల్వ ఉంచిన బేళ్ల కిందకు వర్షపు నీరు చేరడంతో పొగాకు నాణ్యతపై ప్రభావం చూపనుందని రైతులు వాపోతున్నారు. బర్లీ పొగాకును



పొగాకును కొనుగోలు చేయాలంటూ పర్చూరులో ధర్నా చేస్తున్న రైతు సంఘాల నాయకులు, అన్నదాతలు

గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసే ప్రయత్నాలు నెల రోజులుగా జరుగుతూనే ఉన్నాయి. పలు దఫాలుగా పొగాకు రైతుల సమస్యలపై ప్రభుత్వం సమీక్ష చేపట్టింది. కానీ, అన్నదాతలకు ఎటువంటి ప్రయోజనం ఇంతవరకు చేకూరలేదు. రెండు వారాల కిందటే బర్లీ సాగు చేసిన పర్చూరు మండల కౌలు రైతు బలవంతంగా ఉసురు తీసుకోగా, మరొక రైతు చావు అంచుల దాకా వెళ్లి వచ్చారు. బర్లీ పొగాకు కొనుగోలు విషయంలో కంపెనీలను అదే పనిగా ప్రభుత్వం ఆదేశిస్తున్నా అటు వైపు నుంచి కనీస స్థాయిలో కూడా స్పందన కనబడడం లేదు. ధర మీద ఆశలు వదిలేసుకున్న రైతాంగం ఆరుగాలం కష్టపడి పండించిన పంటను పొలానికి ఎరువు వేసే వరకు పరిస్థితి దిగజారింది.

ఉమ్మడి జిల్లాలో 96 వేల ఎకరాలు...

బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు 96 వేల ఎకరాల వరకు బర్లీ పొగాకు సాగవగా, ఒక్క బాపట్ల జిల్లాలోనే 70 వేల ఎకరాల వరకు బర్లీ బాట రైతాంగం పట్టింది. మొత్తం 6 లక్షల క్వింటాల వరకు దిగుబడి వస్తుందనే అంచనాలు ఉండగా ఇప్పటి వరకు కేవలం 50 వేల క్వింటాళ్లు మాత్రమే మార్కెట్‌లోకి వెళ్లింది. మిగిలినదంతా కూడా రైతుల వద్దనే నిల్వ ఉంది. అందినకాడికి పొగాను తెగనమ్ముకుందాం అనుకున్నా.. గతేడాది క్వింటా గరిష్ఠంగా రూ.16 వేల వరకు పలికిందని ఇప్పుడు రూ.7 వేలకు అడిగే వారు లేరని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

అదే నిర్లక్ష్యం..రైతుల ఆందోళన..

పొగాకును బోర్డు ద్వారా కొనుగోలు చేయాలని కేంద్రానికి లేఖ రాశామని ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. మొత్తం దిగుబడులను కంపెనీలు కొనే విధంగా చూస్తామన్నారు. ఈ ప్రకటన తర్వాత ఒక్క జీపీఐ సంస్థ మాత్రం రైతుల నుంచి అరకొరగా పొగాకు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. పర్చూరు, కారం చేడు మండలాలతో పాటు అద్దంకి నియోజకవర్గ పరిధిలోని పంగలూరు మండలంలో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం రైతులు ధర్నా చేపట్టారు. ఈ మేరకు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గుంటూరులోని పొగాకు బోర్డు చైర్మన్‌తో భేటీ అయి న్యాయం చేయాలని కోరారు. బుధవారం జరిగే డీఆర్సీ సమావేశంలో తొలుత ఖరారు చేసిన ఎజెండాల్లో ఎనిమిది అంశాలే ఉండగా బర్లీ పొగాకుకు చోటు దక్కలేదు. ఎమ్మెల్యే ఏలూరి సూచనతో బర్లీ పొగాకు ధర అంశాన్ని కూడా ఎజెం డాలో తొమ్మిదో అంశంగా అధికారులు చేర్చారు. డీఆర్సీ సమావేశంలో ఈ అంశమే కీలకంగా వాడీవేడి చర్చ జరగనుంది.

గుంటూరు మీదగా కొల్లం, హైదరాబాద్‌కి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు గుంటూరు మీదగా కొల్లం, హైదరాబాద్‌కు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07193 చర్లపల్లి - కొల్లం ప్రత్యేక రైలు ఈ నెల 24, 31, జూన్ 7, 14, 21, 28 తేదీల్లో(ప్రతీ శనివారం) రాత్రి 11.10కి బయలుదేరి ఆదివారం వేకువజామునకు ముందు 2.18కి నడికుడి, 3.43కి పిడుగురాళ్ల, 4.33కి సత్తెనపల్లి, 5.30కి గుంటూరు, సోమవారం ఉదయం 7.10కి కొల్లం చేరుకొంటుంది. నంబరు. 07194 కొల్లం - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 26, జూన్ 2, 9, 16, 23, 30 తేదీల్లో(సోమవారం) ఉదయం 10.45కి బయలుదేరి మంగళవారం ఉదయం 10.40కి గుంటూరు, 11.33కి సత్తెనపల్లి, 11.53కి పిడుగురాళ్ల, 12.18కి నడికుడి, సాయంత్రం 3.55కి సికింద్రాబాద్, 5.30కి హైదరాబాద్ చేరుకొంటుందన్నారు.

ఎస్‌ఆర్‌ఎంలో స్పోర్ట్స్ కోటా అడ్మిషన్లు ప్రారంభం



మంగళగిరి సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను స్పోర్ట్స్ కోటా కింద అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. బీటెక్‌తో పాటు బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ డిగ్రీ కోర్సుల్లోనూ అడ్మిషన్లు జరుగుతున్నాయి. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు యాజమాన్యం స్పోర్ట్స్ కోటాలో ప్రవేశాలను కల్పిస్తోంది. అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు నూరు శాతం స్కాలర్‌షిప్ అందిస్తోంది. ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వై.శివశంకర్, స్పోర్ట్స్ డైరెక్టర్ అనూప్‌సింగ్ సూర్యవంశీ స్పోర్ట్స్ కోటా అడ్మిషన్ల వివరాలను వెల్లడించారు. బీటెక్‌లో చేరదలిచిన విద్యార్థులకు టెన్త్, ఇంటర్‌లో 50 శాతం, బీఎస్సీ, బీఏ, బీబీఏ, బీకాం కోర్సుల్లో చేరే విద్యార్థులకు 45 శాతం ఉత్తీర్ణత ఉండాలని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరున్న ఒలింపిక్ గేమ్స్, వరల్డ్ చాంపియన్‌షిప్, ఆసియా, సౌత్ ఆసియన్, కామన్‌వెల్త్ గేమ్స్‌లో పాల్గొన్న వారు నేరుగా అడ్మిషన్ పొందేందుకు అర్హులన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడాకారులకు స్పోర్ట్స్ ట్రయల్స్ నిర్వహించి అడ్మిషన్లు కల్పిస్తామని చెప్పారు. ఈ నెల 26 నుంచి జూన్ 18 వరకు స్పోర్ట్స్ ట్రయల్స్ ఉంటాయన్నారు. డిగ్రీ కోర్సుల్లో చేరదలచిన విద్యార్థులు స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీపతి నంబరు 70365 89973 సంప్రదించాలని సూచించారు.

అత్యాచార బాధితులకు.. భరోసా ఏదీ..?

వైసీపీ హయాంలో మూడు జిల్లాల్లో కలిపి 55 కేసులు

ఇప్పటివరకు ఉద్యోగాలు కల్పించింది ఐదుగురికే

చర్యల కోసం కలెక్టర్లకు ప్రభుత్వ ఆదేశాలు

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్ (పీవోఏ) చట్టం కింద నమోదైన హత్య కేసుల్లో బాధిత కుటుంబాలకు తగిన న్యాయం జరగడం లేదు. ఈ చట్టం ప్రకారం హత్యకు గురైన వ్యక్తి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని స్పష్టంగా ఉన్నప్పటికీ సంబంధిత ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టలేకపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం 2019-2024 మధ్య నమోదైన కేసులను పెండింగ్‌లో పెట్టడం వలన ఇప్పుడు బాధితులు నిత్యం కలెక్టరేట్ల చుటూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నా ఎస్సీలు.. నా ఎస్టీలు అంటూ అధికారంలో ఉండగా బీరాలు పలికిన ఆ పార్టీ నేతలు బాధిత కుటుంబాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఇప్పుడు వారందరికి న్యాయం చేయాల్సిన బాధ్యత టీడీపీ ప్రభుత్వంపై పడింది. అయితే తగిన ఖాళీలు లేకపోవడం, పోలీసు శాఖ నుంచి పూర్తిస్థాయి సమాచారం రాకపోవడం తదితర కారణాలతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఈ కేసులు ఎక్కువ సంఖ్యలోనే పెండింగ్‌లో ఉన్నాయి. దీనిపై ప్రభుత్వస్థాయిలో సమీక్ష నిర్వహించి బాధితులకు తగిన న్యాయం వేగవంతంగా చేయాలని మూడు జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

అత్యాచారణ నిరోధక చట్టం కింద వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక కేసులు నమోదయ్యాయి. గుంటూరు జిల్లాలో 32 హత్యలు జరిగితే బాధితుల కుటుంబాల్లో కేవలం ముగ్గురికే ఉద్యోగం కల్పించారు. పల్నాడు జిల్లాలో 18 హత్యలు జరిగాయి. ఈ జిల్లాలో కేవలం ఇద్దరికే ఉద్యోగం ఇచ్చారు. బాపట్ల జిల్లాలో ఐదుగురు ఎస్సీ/ఎస్టీలు హత్యకు గురవగా, ఒక్కరికి కూడా ఇప్పటివరకు ఉద్యోగం కల్పించలేదు. దీని వలన బాధిత కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. ప్రతీ సోమవారం కారుణ్య నియామకాలకు సంబంధించి నియామక ఉత్తర్వులను కలెక్టరేట్ అధికారులు ఇస్తున్నారు. అయితే పీవోఏ కేసులపై శ్రద్ధ వహించడం లేదు. మూడు జిల్లాలో కలిపి ఇంకా 50 మందికి ఉద్యోగాలు కల్పించాల్సి ఉన్నది. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు జరిగిన ప్రతీసారి దళిత, గిరిజన సంఘాల ప్రతినిధులు దీనిపై అధికారులను నిలదీస్తున్నారు. అయినప్పటికీ స్పందన ఉండటం లేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఆర్థికసాయంగా గుంటూరు జిల్లాకు రూ. 1.80 కోట్లు విడుదలైతే రూ. 96 లక్షలు ఖర్చు పెట్టారు. రూ. 83 లక్షలు ఖర్చు చేయలేకపోయారు. పల్నాడు జిల్లాకు రూ. 1.05 కోట్లు మంజూరైతే రూ. 1.04 కోట్లు ఖర్చు చేశారు. బాపట్ల జిల్లాకు రూ. 1.36 కోట్లు మంజూరైతే రూ. 1.22 కోట్లు ఖర్చు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్థికసాయం అందించడంలో కలెక్టర్లు దృష్టి పెట్టి జిల్లాలకు విడుదలైన నగదుని పంపిణీ చేయాలని, తద్వారా అదనపు నిధులకు ఇండెంట్ పెట్టుకోవాలని ప్రభుత్వం సూచించింది.

బ్యాంకర్లు ఉదారంగా రుణాలు ఇవ్వాలి

◆ కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎంపీ లావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని బ్యాంకు అధికారులు ఉదారంగా రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు కోరారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కర్యాలయంలో పి.జి.ఆర్.ఎస్ సమావేశ మందిరంలో జనవరి త్రైమాసికానికి డి.సి.సి (డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ), డి.ఎల్.ఆర్.సి (డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ)పై బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. మండల స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసుకొని లబ్ధిదారులకు సులభంగా పథకాలపై అవగాహన కల్పించాలని వారు పేర్కొన్నారు. జనవరి - మార్చి త్రైమాసికానికి జిల్లాలోని 310 బ్యాంకులలో సుమారుగా రూ. రూ.41,995.38 కోట్లు వ్యాపారం జరిగిందని లీడ్ బ్యాంక్ మేనేజరు రాం ప్రసాద్ తెలిపారు. ప్రధాన మంత్రి జన ధన యోజన కింద 5,31,755 మందికి రూపే కార్డులు, వార్షిక క్రెడిట్ ప్లాన్ కింద రూ.22,910.84 కోట్లు ఇచ్చినట్లు వెల్లడించారు. కౌలు రైతులు 3,388 మందికి రూ.23.89 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. త్రైమాసిక నివేదికను పి.పి.టి ద్వారా వివరించారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ టి.మాధురి సమావేశం ప్రాముఖ్యతను వివరించారు. ఆర్.బి.ఐ అధికారి అభిషేక్ రాజ్, నాబార్డు డి.డి.ఎం సి.శరత్ బాబు, వివిధ బ్యాంకుల కో- ఆర్డినేటర్లు, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకోవాలి


కెరీర్ గైడెన్స్‌వర్క్ షాపునకు హాజరైన విద్యార్థులు

పొన్నూరుటౌన్(చేబ్రోలు) మే 20 (ఆంధ్రజ్యోతి): నేటి తరం విద్యార్థులు సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సంగం డెయిరి మేనేజింగ్ డైరెక్టర్ పి.గోపాలకృష్ణన్ అన్నారు. సంగం డెయిరి ఉద్యోగుల పిల్లలు, భవిష్యత్, విద్య, ఉద్యోగ అవకాశాలు వంటి అంశాలపై మంగళవారం కెరీర్ గైడెన్స్ వర్క్ షాపు సంగం డెయిరి ఆధ్వర్యంలో విజ్ఞాన్ యూనివర్సిటీలో జరిగింది. ముంబయికి చెందిన మౌంటోరియా సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన కల్పించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలెజెన్స్ విద్యను అభ్యసించడం ద్వారా భవిష్యత్‌లో లభించే ఉపాధి అవకాశాలు వివరించారు. ఈ కార్యక్రమంలో 21 ఏళ్లలోపు ఉన్న 200 మంది సంగం డెయిరీ ఉద్యోగుల పిల్లలు పాల్గొన్నారు. డెయిరీ చీఫ్ ఆపరేషనల్ ఆఫీసర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న నాటిక పోటీలు


కిడ్నాప్ నాటికలోని సన్నివేశం

వినుకొండటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): నందమూరి కళాపరిషత్ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న నాటిక పోటీలు పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. 2వ రోజు మంగళవారం యువభేరి థియేటర్స్ హైద రాబాద్ వారి నా శత్రువు, సిరిమువ్వ కల్చరల్స్ హైదరాబాద్ వారి హక్కు, మద్దుకూరి ఆర్ట్స్ చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారతం నాటికల్లోని పలు సన్నివేశాలు అలరించాయి. మహిళా ప్రేక్షకులను నిర్వాహకులు వివిధ కూపన్ల ద్వారా ఎంపిక చేసి, రూ.2 వేలు విలువ చేసే చీరలను బహూకరించారు. దాతలతో పాటు వేదికకు ము ప్పాళ్ల చెన్నయ్య, రావర్ల శ్రీనివాసరావు పేరుతో నాటిక పోటీలను ప్రారంభించారు. నిర్వాహకులు ముత్తినేని గిరి, బొల్లా వెంకట కోటయ్య, ప్రముఖ న్యాయవాది రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి

బొల్లాపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరు అటవీ ప్రాంతం నుంచి చుక్కల దుప్పి పొలాల్లోకి రావడంతో కుక్కలు వెంబడించి దాడిచేశాయి. స్థానిక రైతులు చూసి వాటిని చెదరగొట్టినప్పటికీ అప్పటికే దుప్పి మృతి చెందింది. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు అక్కడికి వచ్చి దుప్పి కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం అనంతరం దహనం చేశారు.



ఆశ పెట్టుబడి పెట్టి రూ.19 లక్షలు కొట్టేశారు

గుంటూరు నగరంపాలెంస్టేషన్లో సైబర్ క్రైం కేసు నమోదు

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : 'మీ పెట్టుబడికి మాది గ్యారంటీ.. రూపాయికి అర్ధ రూపాయి లాభం ఇస్తామం.' అంటూ ఆశ కల్పించారు.. ముందుగా రూ.10 వేలు పెట్టుబడి పెట్టించి, రూ.16 వేలు వెనక్కి ఇచ్చి వారిలో మరింత ఆశ, నమ్మకాన్ని కలిగించారు. దీంతో నిజమేనా అని నమ్మిన బాధితుడు రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి ఘోరంగా మోసపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీస్ స్టేషన్లో సైబర్ క్రైమ్ కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మెడికల్ కళాశాల సమీపంలోని రైల్వే క్వార్టర్స్ లో నివాసం ఉండే శృంగారపాటి అభిరామ్ డయాలసిస్ సర్వీస్ కంపెనీలో పని చేస్తుంటాడు. తన మొబైల్‌కు గత మార్చి 7న కొన్ని మెసేజ్ లు వచ్చాయి. దాని ఆధారంగా టెలిగ్రామ్ గ్రూపులో అభిరామ్‌ను చేర్చుకున్నారు. తక్కువ పెట్టుబడికి ఎక్కువ లాభాలు వస్తాయంటూ ఆశ కల్పించారు. మొదట్లో కొద్ది లాభంతో.. ఆశపడిన అభిరామ్‌కు రూ.లక్ష పెట్టుబడి పెడితే లక్ష ఇరవై వేలు రూపాయలు ఇస్తామని చెప్పారు. నిజమేనని నమ్మిన అభిరాం తొలత లక్ష రూపాయలతో పాటు దఫాల వారీగా పెంచుకుంటూ పోయాడు చివరకు రూ.19,21,491లు పెట్టుబడిగా పెట్టించారు. తనకు రావాల్సిన మొత్తం ఇవ్వాలని అడగ్గా, మరో ఏడున్నర లక్షల రూపాయలు పెట్టుబడిగా పెట్టాలని కోరారు. లేదంటే కనీసం రూ.నాలుగున్నర లక్షలైనా పెట్టండి అని ఒత్తిడి చేశారు. అయితే అనుమానం వచ్చిన అభిరామ్ తన డబ్బు తనకి ఇస్తే తర్వాత పెట్టుబడి పెడతానని చెప్పాడు. అయితే వారు డబ్బు ఇవ్వకపోవడంతో మోసపోయానని గ్రహించి 1930 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో సైబర్ కేటుగాళ్ల ఖాతాలో ఉన్న రూ.86,361 నగదును బ్యాంకు అధికారులు హోల్డ్ చేశారు. ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు

మాస్టార్లకు గ్రీన్ సిగ్నల్

● ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు.. ● ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు సఫలం

● నేడు విడుదల కానున్న నోటిఫికేషన్

గుంటూరు(విద్య) మే 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులకు ఎట్టకేలకు రంగం సిద్ధమైంది. మంగళవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులతో అధికారులు జరిపిన చర్చలు సఫలం కావడంతో నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మంగళవారం రాత్రి లేదా బుధవారం నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాల సమాచారం నేపథ్యంలో.. ఇప్పటికే వివిధ గ్రేడ్లలో బదిలీలు, ఉద్యోగోన్నతులకు అర్హులైన ఉపాధ్యాయులకు విద్యాశాఖ సమాచారం చేరవేసింది. సిద్ధంగా ఉండాలని అందుకు అవసరమైన ప్రాథమిక సమాచారం సేకరించుకోవాలని సూచించారు.

ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసింది. మరోవైపు ఉమ్మడి జిల్లాలో బదిలీలకు అవసరమైన ప్రాథమిక సమాచారాన్ని విద్యాశాఖ అధికారులు సేకరించి నివేదిక ప్రభుత్వానికి అందజేశారు. ఉమ్మడి జిల్లాలో జడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్ యాజమాన్యాల పరిధిలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయులు కేటగిరిలో దాదాపు 13 వేల మందికి పైగా ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో దాదాపు 2 వేల మందికి పైగా ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీలు కావాల్సి ఉంది. మరో రెండు వేల మందికి అర్హతలను బట్టి బదిలీలు జరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి.

షెడ్యూలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు షెడ్యూలు ప్రకారం జరుగుతాయని అధికారులు వెల్లడించారు. తొలుత ప్రధానోపాధ్యాయులు, ఆ తర్వాత స్కూల్ అసిస్టెంట్స్‌కు నిర్వహిస్తారు. చివరిలో ఎస్‌జీటీలకు బదిలీల ప్రక్రియ కొనసాగిస్తారు. ఇలా ఉమ్మడి జిల్లాలో దాదాపు 4 వేల మందికి పైగా ఉపాధ్యాయులకు స్థాన చలనం కలగనుందని విద్యాశాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి. నోటిఫికేషన్ విడుదల కాగానే ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటారు. ఇందులో విద్యాశాఖ నిర్దేశించిన విధంగా వివరాలను ఉపాధ్యాయులు నమోదు చేస్తారు. తర్వాత ప్రత్యేక సాఫ్ట్వేర్ ద్వారా బదిలీలకు సంబంధించిన కార్యక్రమం ప్రారంభమవుతుంది. తర్వాత ఉపాధ్యాయులు ఆప్షన్స్ పెట్టుకోవాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలను ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఇప్పటికే జారీ చేసింది.

సిద్ధంగా ఉన్నాం: డీఈఓ

ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులకు సంబంధించి సమస్త సమాచారంతో సిద్ధంగా ఉన్నట్లు డీఈఓ సీవీ రేణుక మంగళవారం రాత్రి తెలిపారు. ఇప్పటికే పూర్తి వివరాలను ఉపాధ్యాయులకు వివరించామని నిర్దేశించిన షెడ్యూల్‌ను నిబంధనల ప్రకారం అమలు చేస్తూ కార్యక్రమాన్ని ఉపాధ్యాయుల సహకారంతో సమర్థంగా పూర్తి చేస్తామని ఆమె చెప్పారు.

9 నెలల పాటు నిడమర్రు-కాజా ఎల్‌సీ గేటు మూసివేత

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ), అప్రోచ్ రోడ్ల నిర్మాణం నిమిత్తం నిడమర్రు - కాజా మధ్యన ఉన్న లెవల్ క్రాసింగ్ గేటు నంబరు. 10ని మూసేస్తున్నట్లు గుంటూరు డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది నెలల పాటు ఈ గేటు మూసి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో చినకాకాని నుంచి నిడమర్రు వెళ్లే పాదచారలు, వాహనదారులు హాయ్‌ల్యాండ్ గేటు(ఎల్‌సీ నంబరు. 11) ద్వారా ప్రయాణించాలని సూచించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం


జాన్‌సైదాకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఆర్డీవో మధులత

యడ్లపాడు, మే 20 (ఆంధ్రజ్యోతి): పొలం పనులకు వెళ్లి పిడుగుపాటుకు గురైమృతి చెందిన మండలంలోని కారుచోలకు చెందిన షేక్ పర్వీన్(34) కుటుంబాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రభుత్వం తరఫున ఆదుకున్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.50వేల చెక్కును నరసరావుపేట ఆర్డీవో మధులత సమక్షంలో పర్వీన్ భర్త జాన్ సైదాకు మంగళవారం అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన మిగిలిన ఆర్థిక సాయాన్ని కూడా త్వరలో అందించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తహసీల్దార్ విజయశ్రీ, టీడీపీ నాయకులు ఉన్నారు.

23 నుంచి ప్రజానాట్యమండలి రాష్ట్రస్థాయి శిబిరం


మాట్లాడుతున్న గని, చంద్రనాయక్ తదితరులు

గుంటూరు(తూర్పు), మే 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు, మల్లయ్య లింగం భవన్‌లో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్ తెలిపారు. మంగళవారం గుంటూరు మల్లయ్య లింగం భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని కళాకారులకు కొత్త కళారూపాలు, పాటల శిక్షణను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే సీపీఐ వంద సంవత్సరాల వేడుకలు జరుగుతున్న నేపథ్యంలో తయారుచేసిన పాటలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం కళాకారులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. గుర్తింపు కార్డులు, పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు పాల్గొన్నారు.

మహానాడు తీర్మానాల కమిటీ సభ్యుడిగా ఆనందబాబు



వేమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మహానాడు తీర్మానాల కమిటీ సభ్యుడిగా వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు నియమితులయ్యారు. 22 మందితో కూడిన కమిటీలో ఆయనకు స్థానం లభించడం పట్ల వేమూరు నియోజకవర్గ టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి రైల్వేలైను భూములకు ఫెగ్ మార్కు

అమరావతి, మే 20(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి గ్రామాల్లో రైల్వే లైను ఏర్పాటుకు సంబంధించి భూములను నిర్ధారించేందుకు రైల్వే, రెవెన్యూ అధికారులు ఫెగ్ మార్కు ఏర్పాటు చేయనున్నారు. ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి ఉత్తర్వుల మేరకు రెవెన్యూ అధికారులు మంగళవారం నుండి కార్యక్రమాన్ని ప్రారంభించాల్సి ఉండగా వర్షం కారణంగా బుధవారానికి వాయిదా వేశారు.

భక్తుల భద్రతే మా బాధ్యత : పల్నాడు జిల్లా ఎస్పీ


ప్రార్థన మందిరంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నరసరావుపేట లీగల్, మే 20, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం నుండి జిల్లాలోని ప్రసిద్ధ దేవాలయాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. డాగ్ స్క్వాడ్, లోకల్ పోలీసులు పాల్గొన్నారు.జిల్లాలో ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. దేవాలయాలలో ప్రస్తుతం ఉన్న సెక్యూరిటీ సిబ్బంది వివరాలు తెలుసుకుని, పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా పరిశీ లించారు. ఆలయ అధికారులకు తగు సూచనలు చేశారు. అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. భక్తుల భద్రతను దృష్టి లో ఉంచుకుని అసాంఘిక శక్తులు దాగి ఉండే అవకాశాలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 20 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 512.60 అడుగులు ఉంది. ఇది 136.12 టీఎంసీలకు సమానం.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

జిల్లా మహానాడును జయప్రదం చేయాలి

● బావుడా ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల



సమావేశంలో మాట్లాడుతున్న సలగల రాజశేఖరబాబు

బాపట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పార్లమెంట్ జిల్లా మహానాడు కార్యక్రమం బుధవారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరుగుతుందని బావుడా ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, నక్కా ఆనందబాబు, ఏలూరి సాంబశివరావు, ఎం.ఎం.కొండయ్య, బి.ఎన్.విజయ్‌కుమార్‌లు హాజరవుతారన్నారు. బాపట్ల పార్లమెంట్ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని మహానాడును జయప్రదం చేయాలని ఆయన కోరారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించాలి

● హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు

బాపట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : లబ్ధిదారులు గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకునే విధంగా చూడాలని హౌసింగ్ పీడీ వై.వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం హౌసింగ్ సిబ్బంది, సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో ఆయన సమావేశమయ్యారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులు 450 మందికి అదనంగా రూ.50 వేల చొప్పున బ్యాంక్ ఖాతాలలో జమ అయినట్లు తెలిపారు. కావున వారితో నిర్మాణాలు పూర్తిచేయించాలన్నారు. స్లాబ్‌లెవెల్ వచ్చిన 75 గృహాలు వెంటనే పూర్తి చేయించాలన్నారు. మిగిలినవి కూడా జూన్ 12వ తేదీలోపు పూర్తి చేసే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, హౌసింగ్ డీఈ కె.శ్రీనివాసరావు, మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ వై.వెంకటేశ్వరరావు, చిత్రంలో కమిషనర్ జి.రఘునాథరెడ్డి తదితరులు

సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించాలి : కమిషనర్

బాపట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో మంగళవారం మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ ఎం.ఎస్.ఎం.ఇ రుణాల పురోగతి గురించి ఆరా తీశారు. ప్రజలకు సూర్యఘర్‌పై అవగాహన కల్పించి గృహాల విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో కేంద్ర ప్రభుత్వం అందించే సోలార్ ప్యానల్‌ను అమర్చుకునే విధంగా ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. ఈ సమావేశంలో మెప్మా సీఎంవో ఎన్.సుబ్రహ్మణ్యం, సీవోలు తదితరులు పాల్గొన్నారు.

బిల్‌గేట్స్ ప్రశంసలు ఆంధ్రజాతికి గర్వకారణం : కొల్లా

బాపట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై బిల్‌గేట్స్ ప్రశంసలు కురిపించటం ఆంధ్రజాతికి గర్వకారణమని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ఒకప్పుడు 5 నిమిషాలు ఇంటర్వ్యూ కోరితే రాజకీయ నాయకులతో కలవటం వలన టైమ్‌వేస్ట్ అని భావించి నిరాకరించిన బిల్‌గేట్స్‌ను అతికష్టం మీద ఒప్పించి ఇచ్చిన వీడియో ప్రజంటేషన్‌తో మెప్పించి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ బ్రాంచ్ ఏర్పాటు చేయించటం ఓ అపూర్వ చరిత్ర అన్నారు. చంద్రబాబుకు ఐటీ రంగం భవిష్యత్తుపై గల విజన్‌కు ఫిదా అయిన బిల్‌గేట్స్ ప్రపంచంలో అప్పటి వరకు ఎక్కడ బ్రాంచ్ పెట్టని మైక్రోసాఫ్ట్‌ను మొట్టమొదట బ్రాంచ్‌ను హైదరాబాద్‌లో పెట్టటం ఆ తర్వాత అనేక ప్రతిష్ఠాత్మక సంస్థలు క్యూకట్టటంతో నూతనశకం ఆరంభమైందన్నారు. దేశంలో బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో ఆంధ్రప్రదేశ్ మాత్రమే ముందుగా ఒప్పందం కుదుర్చుకోవటం చంద్రబాబు దార్శనికతకు నిదర్శనమన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల నమోదు సర్వే



సర్వే ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ జోత్స్న, భవిత సెంటర్ సిబ్బంది

బాపట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించే పనిలో భాగంగా సమగ్రశిక్ష సిబ్బంది సర్వే ప్రారంభించారు. ఏపీసీ నాగిరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కో ఆర్డినేటర్ జోత్స్న, బాపట్ల భవిత సెంటర్ ఉపాధ్యాయులు కరుణకుమారి, రమాదేవిలు మండలంలోని పలు గ్రామాలలో సర్వే చేసి పిల్లలను గుర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నుంచి 18 సంవత్సరాలలోపు వయసు ఉన్న విభిన్న ప్రతిభావంతులైన పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించేవిధంగా వారికి మెరుగైన విద్యను, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వివరించారు. ఈనెల 13వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ఇంటింటా సర్వే నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ప్రత్యేక అవసరాలు గల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 21 లోపాలు గల చిన్నారులను గుర్తించి వారి సమాచారం సేకరిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం చుండూరుపల్లి పరిసర గ్రామాలలో సర్వే నిర్వహించారు.



సచివాలయాల ఉద్యోగులకు సూచనలు చేస్తున్న ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు

తుఫాన్ షెల్టర్లును సిద్ధంగా ఉంచుకోవాలి

● ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు

కర్లపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి) : సముద్ర తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు తుఫాన్ షెల్టర్లును సిద్ధంగా ఉంచుకోవాలని ఆయా గ్రామ సచివాలయాల ఉద్యోగులను ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు ఆదేశించారు. మండలపరిధిలోని పేరలి, కట్టవాద, తుమ్మలపల్లి, పెదగొల్లపాలెం గ్రామాలలో ఉన్న తుఫాన్ షెల్టర్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి తుఫాన్ షెల్టర్‌కు విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వాయుగుండం వలన ఎటువంటి విపత్కర పరిస్థితి ఎదురైన ప్రజలను తుఫాన్ షెల్టర్‌లోకి తరలించేలా ఏర్పాట్లు చేయాలని ఆయా గ్రామాల సచివాలయ సిబ్బందికి తెలిపారు.

● పెదగొల్లపాలెం, తుమ్మలపల్లి, సచివాలయాలను మంగళవారం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలుసూచనలు చేశారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు చేసుకోవాలి

పిట్టలవానిపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లూరు గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికిసంబంధించిన ధర్మకర్తల మండలి నియామకానికి ఈనెల 26వ తేదిలోపు ఆసక్తి గలవారు దరఖాస్తులను జిల్లా దేవదాయశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి మంతెన విఠల శ్రీనివాసవర్మ తెలిపారు. ఈ పాలకమండలి నియామకానికి ఓసీలు ఐదుగురు వారిలో ఒకరు బ్రాహ్మణ, ఇతరులు ఐదుగురు, వారిలో మహిళలు బీసీ మహిళ, ఎస్సీ మహిళ, ఎస్టీ మహిళ, ఓసీ మహిళ మొత్తం 9మంది సభ్యులు ఉంటారని ఆయన తెలిపారు.

రేపల్లెలో భారీ వర్షం

● రహదారులు జలమయం
● ప్రయాణికుల ఇక్కట్లు

రేపల్లె, మే 20 (ఆంధ్రజ్యోతి) : తీర ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి నుంచి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడటంతో రహదారులు, లోతట్టుప్రాంతాలు జలమయంగా మారాయి. పట్టణంలోని ప్రకాశంరోడ్డు, మున్సిపల్ ఆఫీస్ రోడ్డు, బస్టాండ్ రోడ్డు, అంబేద్కర్ పార్కు రహదారి, జగనన్నకాలనీలు, జూనియర్ కళాశాల ప్రాంగణంలోని ఎగ్జిబిషన్ చుట్టూ అడుగులోతు నీరునిలిచాయి. దీంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పురపాలకసంఘంలో డ్రెయిన్‌లను పూర్తిస్థాయిలో బండలు వేసి ఆక్రమించుకోవటంతో వర్షపునీరు పారుదలయ్యే పరిస్థితి లేదు. దీంతో వర్షపునీరు పోయే మార్గం లేక రహదారులపైనే గంటలతరబడి నిలబడటంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు దృష్టిసారించి డ్రెయిన్‌లపై ఆక్రమణలు తొలగించాలంటూ పట్టణవాసులు కోరుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ఈదురుగాలుతో కూడిన వర్షం రావటంతో నగరం, నిజాంపట్నం, రేపల్లె రూరల్ మండలాల్లోని మామిడితోటలు కాయలంతా నేలపాలై తీవ్రనష్టం వాటిల్లిదంటూ మామిడిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూనియర్‌కళాశాల ప్రాంగణంలో పెట్టిన ఎగ్జిబిషన్‌లో రెండు అడుగులలోతు వర్షపు నీరు నిలవటంతో ఎగ్జిబిషన్‌కు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఆయిల్ ఇంజన్ మోటార్ల ద్వారా నీటిని తోడుకోవాల్సిన పరిస్థితి నెలకొందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బస్టాండ్ రోడ్డులో వర్షం తాకిడికి నిలిచిన వర్షపు నీరు



ఎగ్జిబిషన్ చుట్టూ చేరిన వర్షపు నీరు

ఘనంగా పెద్దింటమ్మతల్లి కొలుపులు

కర్లపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామంలోని గ్రామదేవత శ్రీపెద్దింటమ్మ తల్లి కొలుపులును గ్రామస్థులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జనసేన పార్టీ బాపట్ల సమన్వయకర్త నామన శివన్నారాయణలు శ్రీపెద్దింటమ్మ తల్లిని దర్శించుకొని పూజలు చేశారు. వేగేశన నరేంద్రవర్మను గ్రామస్థులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. గ్రామస్థులు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కుంటా రత్నబాబు, మాడా శ్రీనివాసరావు, సూరినేని మురళీకృష్ణ, మర్రి అశోక్, గరిగంటి శ్రీనివాసరావు, గుర్రాల అప్పారావు, తాండ్ర శ్రీనివాసరావు, తోట ఏసురాజు, ఏమినేని తిరుపతయ్య, సోమా శేషయ్య, దొడ్డా వెంకటరామారావు, డెంకేను రామారావు, బీసాబత్తిని వెంకటేశ్వర్లు, ఇక్కుర్తి నాగాంజనేయులు పాల్గొన్నారు.

పోలేరమ్మ అమ్మవారికి పొంగళ్లు

కర్లపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని లంకాఛానల్ పై ఉన్న శ్రీపోలేరమ్మ అమ్మవారికి భక్తులు సోమవారం పొంగళ్లు పొంగించి దూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. కొలుపులలో భాగంగా శ్రీ పోలేరమ్మ అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

రీసర్వే తాత్కాలికంగా నిలిపివేత

పిట్టలవానిపాలెం,మే 20 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు కారణంగా మండలంలోని పిట్టువారిపాలెం, ఖాజీపాలెం, జిఎన్‌పాలెం, పిట్టలవానిపాలెం, మంతెనవారిపాలెం గ్రామపంచాయతీలలో జరుగుతున్న రీసర్వే ప్రాజెక్ట్ కార్యక్రమం తాత్కాలికంగా నిలిపివేసినట్లు పిట్టలవానిపాలెం మండల తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు.

వ్యాపారవేత్తలను తయారు చేయటమే లక్ష్యం

కర్లపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్తను, ప్రతి గ్రామం నుంచి పారిశ్రామికవేత్తను తయారు చేయటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెంలోని భవితా వివోలో జరుగుతున్న హెచ్‌ఎల్‌పిల ప్రిపరేషన్‌ను పీడీ శ్రీనివాసరావు సోమవారం సందర్శించి పరిశీలించారు. నెలలో ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ సీసీ రాఘవ, ఎం.ఎస్. అకౌంటెంట్ లక్ష్మి, వీవోఏలు రాజ్యలక్ష్మిపాల్గొన్నారు.



మండల సమాఖ్య సిబ్బందితో సమావేశమైన డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు

గుండెపోటుతో మున్సిపల్ కార్మికుడి మృతి



అంకయ్య మృతదేహం

వేమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : తెనాలి మున్సిపాలిటీలో శానిటరీ పని చేస్తున్న కార్మికుడు పొన్నూరు అంకయ్య (58) జంపని గ్రామంలోని అగాపే ప్రేయర్ ఫెలోషిప్ చర్చి వెనుక ఉన్న పంట కాల్వలో పడి మృతి చెందాడు. మంగళవారం ఉదయం అంకయ్య మృతదేహాన్ని సమీప రైతులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. వేమూరు ఎస్ఐ శివకృష్ణ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అతని జేబులో ఉన్న ఫోన్ ద్వారా చిరునామాను గుర్తించారు. తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని ఎస్టీ కాలనీలో నివసిస్తున్న అంకయ్య మున్సిపాలిటీలో శానిటరీ విభాగం కార్మికుడిగా పని చేస్తున్నాడు. మూడు సంవత్సరాల నాడు గుండెపోటు రావడంతో గుంటూరులో చికిత్స పొందుతున్నాడు. కార్మికుడిగా ఉద్యోగం చేస్తూనే మిగతా సమయంలో చుట్టుపక్కల గ్రామాల్లో పాత ఇనుము, ప్లాస్టిక్ సామాన్లు ఏరుకుని వాటిని అమ్ముకుంటూ ఉన్నాడు. అదే పద్ధతిలో జంపని వచ్చిన అతను చర్చి సమీపంలో ఉన్న పంట కాల్వ వద్ద పాత ఇనుము సేకరిస్తున్న సందర్భంలో గుండెపోటు వచ్చి అక్కడికక్కడే మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



రేపల్లె బస్టాండ్‌సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

కార్మికుల లేబర్ కోడ్స్ రద్దు చేయాలి : సీఐటీయూ

రేపల్లె, మే 20(ఆంధ్రజ్యోతి) : కార్మికులకు ప్రమాదమైన లేబర్ కోడ్స్‌ను అమలు చేయవద్దని, కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. దేశవ్యాప్తంగా లేబర్‌కోడ్‌ను వ్యతిరేకిస్తూ నిరసనలో భాగంగా మంగళవారం బస్టాండ్ సెంటర్ వద్ద సీఐటీయూ నాయకులు, కార్మికులు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ సత్వరమే కార్మికులపై ఏర్పాటు చేసిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.ఆశీర్వాదం, కె.రమేష్, అంగన్‌వాడీ నాయకులు కె.రూప్సీ, మున్సిపల్ ఇంజనీర్ వర్కర్స్ జీ.ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు, వై.వాసు, కె.వెంకటేశ్వరరావు, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేమూరులో...



వేమూరులో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

వేమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం వేమూరులోని రైల్వే గేటు వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమానికి సీఐటీయూ మండల కార్యదర్శి బి.అగస్టీన్ పాల్గొని మాట్లాడుతూ ముఠా రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జాతీయస్థాయిలో జూన్ 9న జరగనున్న జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియర్ నాయకులు వేమూరి విజయరాజు, వేమూరి యోహాను, సురేష్, దుర్గాభార్గవి తదితర కార్మికులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో...



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు

భట్టిప్రోలు (కొల్లూరు), మే 20 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని తలపెట్టిన అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. భట్టిప్రోలులోని పంచాయతీ కార్యాలయం అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ మే 20న జరగాల్సిన దేశవ్యాప్త సమ్మె జూలై 9కి వాయిదా వేసినప్పటికీ దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోదీ నాయకత్వంలోని కేంద్రం, బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనం కోసం నాలుగు లేబర్ కోడ్లు మార్చివేసిందని విమర్శించారు. చేనేత కార్మిక సంఘ నాయకులు దీపాల సత్యనారాయణ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు సీతామహాలక్ష్మి, శ్రీను, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో నిండిన తహసీల్దార్ బంగ్లా స్థలం

● పట్టించుకోని అధికారులు
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

బాపట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వెనుక ఉప్పరపాలెం వెళ్ళేరోడ్డు పక్కనే తహసీల్దార్ బంగ్లా స్థలం వ్యర్థాలతో నిండి దుర్గంధ పూరితంగా మారింది. పూర్వం తహసీల్దార్ కార్యాలయ రికార్డు విస్తరణ విభాగం కింద ఇక్కడ భవనం ఉండేది. ఆ తర్వాత దీనిని తహసీల్దార్ బంగ్లాగా మార్చారు. 1999 వరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్‌లు అక్కడ బంగ్లాలో ఉండేవారు. ఆ తర్వాత వచ్చిన అధికారులు ఇక్కడ ఉండకపోవటంతో కాలక్రమేణ అది శిథిలమైంది. దీంతో అధికారులు భవనాన్ని తొలిగించారు. ప్రస్తుతం ఈ స్థలంలో ముళ్ళచెట్లు, పొదలు పెరిగిపోయాయి. చుట్టుపక్కల కుటుంబాలవారు వ్యర్థాలు ఈ స్థలంలో వేస్తున్నారు. దుర్గందంపూరితంగా మారిన ఈ స్థలంలో పందులు స్వైరవిహారం చేయటం పరిపాటిగా మారింది. అయినప్పటికి రెవెన్యూ అధికారులు పట్టించుకోవటంలేదు. ప్రస్తుతం పనిచేస్తున్న అధికారులకు ఇక్కడ స్థలం ఉంది అనే విషయం కూడా తెలియకపోవటం గమనార్హం. విలువైన 7 సెంట్ల భూమి చుట్టూ పహరీ ఉన్నప్పటికి గేటు లేకపోవటంతో వ్యర్థాలు మొత్తం అందులోనే వేస్తున్నారు. పైగా దీనిని శుభ్రం చేయకపోవటం వల్ల ముళ్ళచెట్లు పెరిగిపోయాయి. పక్కనే బాలికాసదన్, మరో పక్కనే స్కౌట్ బిల్డింగ్ ఉన్నాయి. ఇక్కడ వేసిన వ్యర్థాలు నుంచి వచ్చే దుర్వాసనతో చుట్టుపక్కలవారు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు దీనిపై స్పందించి స్థలాన్ని శుభ్రం చేయించి ప్రభుత్వ కార్యాలయ నిర్మాణం లేదా తహసీల్దార్ బంగ్లా వంటివి నిర్మించి ఉపయోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా మున్సిపల్ అధికారులు ఈ స్థలంలో చెత్త, వ్యర్థాలు వేయకుండా చూడటంతోపాటు అక్కడ ఉన్న వాటిని శుభ్రంగా తీయించాలని పరిసరప్రాంత ప్రజలు కోరుతున్నారు.



ఉప్పరపాలెం రోడ్డు పక్కనే చెత్తాచెదారంతో నిండి ఉన్న తహసీల్దార్ బంగ్లా స్థలం

గణేష్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

● చేనేత సహకార సంఘం అధ్యక్షుడు దివి రాంబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దివి రాంబాబు, చేనేత నాయకులు

చెరుకుపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి) : చేనేత రంగంపై వైసీపీ నేతల వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని చెరుకుపల్లి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు దివి రాంబాబు అన్నారు. చెరుకుపల్లిలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేతరంగంపై ప్రేమ ఉంటే గత ఐదు సంవత్సరాల నుంచి సమస్యలపై ఏమీ మాట్లాడకుండా ఈరోజు గుర్తుకు వచ్చినట్లు ఈపూరి గణేష్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఇటీవల రాష్ట్ర చేనేతమంత్రి ఎస్.సవిత రాష్ట్రంలో ఉన్న చేనేత ప్రతినిధులతో సమావేశం జరిపి సమస్యలు తెలుసుకున్నారని, వైసీపీ ప్రభుత్వ హయాంలో చేనేత సమస్యలు అడగడం చేయకపోగా ఉన్న వాటిని రద్దుచేశారన్నారు. సహకార సంఘాలకు ఇస్తున్న పావలా వడ్డీ, 20 శాతం రిబేటు, త్రిఫ్ట్‌ఫండ్, హెల్త్ స్కీంలను విచక్షణారహితంగా రద్దు చేసి సహకార సంఘాలను నిర్వీర్యం చేసి ఈరోజు చేనేత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో దివి శ్రీనివాసరావు, కందుల వెంకటేశ్వరరావు, ఓరుగంటి శివనాగేంద్రం, పంచుమర్తి వీరరాఘవయ్య, కందుల రవీంద్ర,గొర్రె రమేష్, మాచర్ల శ్రీనివాసరావు, ముమ్మలేటి లక్ష్మీనారాయణ. గుర్రం దేవలరావు, మండూరు శ్రీను పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాల రద్దు నిర్ణయంపై డీలర్స్ హర్షం

చెరుకుపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం రేషన్ డీలర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథాగా వెచ్చించి ఏర్పాటు చేసిన ఎండీయూ వాహనాల విధానాన్ని రద్దుచేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని చెరుకుపల్లి మండల రేషన్ డీలర్స్ అధ్యక్షుడు నాగుల పున్నారావు అన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ మరలా రేషన్ డీలర్లకు ఊపిరిపోసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌లకు డీలర్స్ అందరి తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధానమంత్రి సూర్యఘర్‌తో పల్లెల్లో వెలుగు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

నగరం, మే 20(ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి సూర్యఘర్ ద్వారా విద్యుత్ ఆదాతో పాటు ఆదాయం లభిస్తుందని ఎంపీడీవో బి.శ్రీనివాసరావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రధానమంత్రి సూర్యఘర్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో ఉన్న సచివాలయ సిబ్బంది, బీవోఏల ద్వారా గ్రామప్రజలకు సోలార్‌రూఫ్ టాప్‌ప్యానల్ నిర్మించుకోవటం ద్వారా 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తారని తెలిపారు. ఆసక్తి గల వారు సచివాలయంలోగాని, మీసేవలోగాని సంప్రదించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, తద్వారా ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి శ్వేతార్క పుష్ప పూజ



తెల్లజిల్లేడు పుష్ప పూజలో వీరాంజనేయస్వామి

వేమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామంలో ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి వారికి విశేషంగా శ్వేతార్క పుష్ప పూజ నిర్వహించారు. గొంది శివరామకృష్ణప్రసాద్ దంపతులు ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహింపజేసి పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం తెల్ల జిల్లేడు పుష్పాలతో అష్టోత్తర సహస్ర నామ పూజలు జరిపి పల్లకి ఉత్సవం నిర్వహించారు. భజన సమాజాల వారు హనుమాన్ చాలీసా పారాయణ చేసి భజన కీర్తనలు ఆలపించారు.

ఘనంగా హనుమజ్జయంతి ఉత్సవాలు

భట్టిప్రోలు (కొల్లూరు), మే 20 (ఆంధ్రజ్యోతి) : హనుమజ్జయంతి ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఐలవరం ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా మంగళవారం వాసుదేవనంద స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం ఆలయంలో స్వామి వారి చెంత మహిళా భక్తులు కోలాటంతో భజన సంకీర్తనలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు దీవి రఘునాధ చక్రవర్తి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వామనపల్లి వెంకటేశ్వరరావు, జంజనం హేమశంకరరావు, సాంబశివరావు, ఆకురాతి పూర్ణచంద్రరావు, సుజాత, బట్టు వీరరాఘవయ్య, దాస సాహిత్య ప్రాజెక్టు భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.



ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో కోలాటం చేస్తున్న భజన బృందాలు


కిశోరి వికాసంపై అవగాహన

కొల్లూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : కిశోరి వికాసంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అవగాహన సదస్సు నిర్వహించారు. కొల్లూరులోని అంగన్‌వాడీ కేంద్రం-2లో కిశోరి బాలికల సాధికారతపై మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు మాట్లాడుతూ, బాలికల పట్ల లింగ వివక్ష, అనమానతలు చూపరాదని, బాలికల సాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కృషి చేస్తున్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సమానంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ సంరక్షణ కార్యదర్శి, పిల్లల తల్లులు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



కిశోరి వికాసంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ విజయలక్ష్మి

అభివృద్ధికి పరితపిస్తున్న.. పురావస్తు శాల



శిలాఫలకాలు

దేశంలోనే ఏకైక ఐల్యాండ్ మ్యూజియం నాగార్జున కొండ

ఆధునికీకరణకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు చొరవ


టూరిజం అభివృద్ధికి కేంద్రం రూ. 25 కోట్ల కేటాయింపు

మాచర్లటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి చెందిన నాగార్జున కొండ మ్యూజియం అభివృద్ధిని కాంక్షిస్తోంది. శిల్ప కళాఖండాలు, నాగార్జునుని, బుద్ధుని, శాతవాహనలు, ఇక్ష్వాకుల కాలంనాటి ప్రజల జీవనశైలికి ప్రత్యక్ష నిదర్శనం ఈ మ్యూజియం. ఇక్కడ 3, 4వ శతాబ్దపు చరిత్రను కనులకు కడుతుంది. ఇంతటి ప్రాశస్త్యం కలిగిన ఈ పురావస్తుశాల అభివృద్ధిని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు గుర్తించారు. ఇదే విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించి, బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా కృషి చేశారు. కానీ, ఈ నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది.

దేశంలోనే ఏకైక ఐల్యాండ్ మ్యూజియం



భారతదేశంలో ఏకైక ఐల్యాండ్ మ్యూజియంగా నాగార్జున కొండ ప్రపంచంలోనే రెండో అతి పెద్దది. కొండపై ఉన్న ఈ మ్యూజియం చరిత్రకు ప్రత్యక్ష సాక్షిగా నిలుస్తోంది. 23 చదరపు కిలోమీటర్ల వైశాల్యం కలిగి నాగార్జున కొండ లోయప్రాంతం అపార జలరాశిలో లీనమై ఉంది. తూర్పున ఫిరంగి మోటు, దక్షిణాన ఎద్దనమోటు కొండల మధ్య గల నాగార్జున కొండ పొంగిన కృష్ణానది జలాశయంలో అద్భుత ద్వీపంగా మారింది. ప్రాచీన కాలాన ఈ కొండను శ్రీ పర్వతమని, మధ్యయుగం నుంచి నాగార్జున కొండగా పిలువబడుతోంది. 1929 ప్రాంతంలోనే నాగార్జున కొండకు దిగువన మ్యూజియం ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం నదీ జలాలతో మునిగిపోయే సమయంలో 1966లో నాగార్జున కొండపై ప్రస్తుతం ఉన్న మ్యూజియాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఆచార్య నాగార్జునుడు ఈ ప్రాంతంలో నివసించడం వల్ల దీనికి నాగార్జున కొండని పేరొచ్చింది. 1926 మార్చిలో శాసన పరిశోధన కార్యాలయ ఉద్యోగి ఏఆర్ సరస్వతి దృష్టి ఈ ప్రాంతంపై పడింది. 1927-31 నాటికి విశేషంగా తవ్వకాలు జరపగా కొన్ని స్థూపాలు, విహారాలు, శిలాఫలకాలు, 1938-40 తవ్వకాల్లో శిలా శాసనాలు బయల్పడ్డాయి. 1954-60 మధ్య సాగిన తవ్వకాల్లో బౌద్ధ నిర్మాణాల గురించి విశేషంగా లభ్యమయ్యాయి. వీటిలో ప్రాగ్ హైతిహాస అవశేషాలు, వివిధ వైదిక మత, గృహ నిర్మాణాలు వెలుగుచూశాయి. 1955 డిసెంబరు 10న నాగార్జున సా గర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి శంకుస్థాపనకు వచ్చిన అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మ్యూజియం నిర్మించాలని ఆదేశించారు. శిథిలాల్లో కొన్నింటిని యథాతదంగా ఈ కొండపై పునర్నిర్మించారు. మరికొన్నింటిని కొలమాన ప్రతిరూపంగా ప్రదర్శించబడ్డాయి. ప్రాచీన కాలం నుంచి నేటి వరకు నిరంతరాయంగా నాగార్జున కొండ ప్రాంతం..మానవ నివాస స్థలంగా బాసిల్లుతోంది.



మ్యూజియం లోపలి భాగం

ఎంపీ లావు చొరవతో రూ.25కోట్ల కేటాయింపు..కానీ..

గత పార్లమెంట్ సమావేశాల్లో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నాగార్జున సాగర్ టూరిజం అభివృద్ధికి నిధు లు కేటాయించాలని కోరారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్లో రూ.25 కోట్లు కేటాయించింది. పర్యాటక కేంద్రం ఏర్పడి 75 సంవత్సరాల తరువాత అభివృద్ధి కోసం భారీ స్థాయిలో నిధులు మంజూరు చేయడం ఇదే మొదటిసారి. నాగార్జున సాగర్ నిర్మాణ సమయంలో ఐ ల్యాండ్‌పై ఏర్పాటు చేసిన మ్యూజియంకు నేటి వరకు బడ్జెట్ కేటాయింపు లేక సరైన అభివృద్ధికి నోచుకోలేదు. బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 25 కోట్లు పొందుపరిచారే గానీ ఆ నిధులు ఇప్పటికీ విడుదల కాలేదు. పర్యాటకులకు వసతి గృహాలు, పార్కుల అభివృద్ధి, నూతన లాంచీలు, హోటళ్లు, రిసార్ట్స్ మౌలిక వసతులు, సుందరీకరణను అభివృద్ధి చేయాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన నిధులు త్వరగా మంజూరు చేస్తే నాగార్జున సాగర్ టూరిజం అభివృద్ధి చెంది పూర్వ వైభవాన్ని సంతరించుకోనుంది.



మ్యూజియంలోని బుద్ధుని పాలరాతి విగ్రహం

నల్లమడ వాగు విస్తీర్ణం పెంచాలి

కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : నల్లమడ వాగు పూడిక తొలిగించి వాగు విస్తీర్ణం పెంచాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. వాగు విస్తీర్ణం పెంచడానికి కావాల్సిన భూమి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. నీటిపారుదల, డ్రెయినేజీశాఖల పరిధిలో నిర్వహించే ఆపరేషన్ అండ్ నిర్వహణ పనులను మంగళవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, అధికారుల బృందంతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ముందుగా బాపట్ల మండలం జిల్లెళ్ళమూడిలో నల్లమడ వాగులో కోతకు గురవుతున్న కరకట్ట ప్రాంతాన్ని సందర్శించారు. బాపట్ల జిల్లాకు నీటి సరఫరా చేసే కొమ్మమూరు కెనాల్, పీటీ చానల్‌ను, నరసాయపాలెంలోని లాక్‌ల వద్ద చానల్స్ పరిశీలించారు. కట్టపై మొక్కలు నాటి నీరు పోశారు. సమ్మర్ స్టోరేజి ట్యాంక్ పూడికతొలిగించి ట్యాంక్ విస్తీర్ణాన్ని పెంచి నీటి నిల్వ సామార్థ్యాన్ని పెంచాలన్నారు. దానికి సంబంధించిన ప్రతిపాధనలను తయారు చేయాలని నీటిపారుదలశాఖ ఎస్ఈకి కలెక్టర్ సూచించారు. సమ్మర్ స్టోరేజి ట్యాంక్ నుంచి నీటి సరఫరా 35 నుంచి 60రోజులకు పెంచాలని చెప్పారు. నరసాయపాలెంలోని చెరుకూరు ట్యాంక్ చానల్‌లో గుర్రపు డెక్క, తూటికాడ తొలిగింపు పనులను కలెక్టర్, ఎమ్మెల్యేలు కలిసి ప్రారంభించారు. నరసాయపాలెం పంచాయతీ ప్రజలు అక్కడ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పంచాయతీలో చెత్తసేకరణ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పంచాయతీ సెక్రటరీ రాజును కలెక్టర్ ప్రశ్నించారు. పంచాతీయకి ఎస్‌డబ్ల్యూ పీసీ ల్యాండ్ కోసం ప్రతిపాదనలు పంపాలని జిల్లా రెవెన్యూ అధికారికి కలెక్టర్ సూచించారు. తదుపరి నల్లమడ వాగు లాక్‌లను పరిశీలించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పలు విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ వెంకటరత్నం, డ్రెయినేజి ఈఈ మురళీకృష్ణ, ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్.సలీమా పాల్గొన్నారు.



నల్లమడ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

బ్లాక్ రైస్ బహుబాగు.. రెడ్ రైస్ రెడీ

-నూతన వంగడాల్లో బాపట్లకు అగ్రస్థానం



బాపట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): పోషకాలు మెండుగా ఉండే అద్భుత వంగడాల సృష్టిలో బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం అగ్రభాగాన నిలిచింది. ఇప్పటికే 14 రకాల వరి వంగడాలను ఆవిష్కరించారు. మరో నాలుగు రకాలు విడుదలకు సిద్ధం చేస్తున్నారు. వాటిల్లో రెడ్ రైస్‌తోపాటు మరో మూడు వంగడాలు ఉన్నాయి. అంతర్జాతీయ ప్రాధాన్యం సంతరించుకున్న బీపీటీ 5204 (సాంబమసూరి) రకాన్ని రూపొందించిన ఇక్కడ శాస్త్రవేత్తలు తాజాగా బ్లాక్ రైస్, రెడ్‌రైస్‌ను రూపొందించారు. బ్లాక్ రైస్ ఇప్పటికే విడుదలై ప్రాచుర్యం పొందింది. రెడ్ రైస్ మినీకిట్‌లు పంపిణీ చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు.

బ్లాక్‌రైస్-2841

దశాబ్దాలుగా రైతు సేవలో కొనసాగుతున్న ఈ పరిశోధన స్థానం బీపీటీ 2841 పేరుతో బ్లాక్ రైస్ వంగడాన్ని విడుదల చేసింది. బ్లాక్ రైస్‌లో బియ్యం పొర నలుపు రంగులో ఉండటం వల్ల ఫినాల్స్, ఫ్లావినాయిడ్స్, యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటి ఎక్కువగా ఉంటాయి. దీనిని ఆహారంగా తీసుకున్నప్పుడు మధుమేహం, క్యాన్సర్, గుండె సంబంధిత సమస్యలను ఎదుర్కొనే రోగనిరోధకశక్తి పెరుగుతుంది. దీంతోపాటుగా ప్రొటీన్, జింకు, ఇనుము, పీచు పదార్థాలు కూడా అధిక మోతాదులో ఉన్నట్లు నమోదు చేయబడింది. ప్రస్తుత మార్కెట్‌లో కిలో బ్లాక్ రైస్ రూ.300లకు పైగా విక్రయిస్తున్నారు. ఆరోగ్యవంతమైన, చీడపీడలను తట్టుకునే సామర్థ్యం కలిగిన నల్ల ధాన్యం పంట కాలం 130 నుంచి 135 రోజులు ఉంటుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో నల్ల ధాన్యం సాగు క్రమంగా విస్తరిస్తోంది. ఈ బియ్యాన్ని ఉడికించినప్పుడు అన్నం ముద్దగా మారుతుంది. అందువల్ల రోజు ఈ బియ్యాన్ని ఆహారంగా తీసుకోలేం. ఎకరానికి 30 నుంచి 35 బస్తాల దిగుబడి వస్తుంది. ఆర్గానిక్‌సాగు కింద పండించుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. ధాన్యం సన్నగా ఉంటాయి. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో నల్ల వరివిత్తనాలు సాగు చేస్తున్నారు. ఇందులో ఆశించిన ఫలితాలు రావడంతో రైతులు నుంచి ఈ విత్తనాలకు డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది సీడ్ కిలో రూ.77.8 లు చొప్పున విక్రయించేందుకు సిద్ధం చేశారు. విత్తనాలు కోసం ఇప్పటికే అనేక మంది రైతులు దరఖాస్తు పెట్టుకున్నారు.

రెడ్‌రైస్- 2858

బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం రెడ్ రైస్‌ను రూపొందించారు. ఇప్పటికే ఇది మినీ కిట్‌ల రూపంలో రైతులకు అందించి ఫలితాలను పరిశీలించారు. దీనిని ఈ ఏడాది విడుదల చేసే అవకాశం ఉంది. బీపీటీ-2858 పేరుతో రెడ్ రైస్‌ను రూపొందించారు. జింకు, ఐరన్, సూక్ష్మపోషకాలు ఇందులో అధికంగా ఉంటాయి. ఇతర ప్రాంతాల్లో పండించే ముతక రకం కాకుండా సన్న బియ్యంగా బాపట్ల రెడ్‌రైస్ ఉంటుంది. ప్రజలు తినేందుకు ఆసక్తి చూపించే విధంగా శాస్త్రవేత్తలు దీనిని రూపొందించారు. ప్రీ రిలీజు కల్చర్ కింద ఈ విత్తనాలను కిలో రూ.50కు అందించేందుకు సిద్ధం చేశారు. ఇక్కడ విత్తనాలను రీసెర్చ్ సెంటర్‌లకు, దరఖాస్తులు పెట్టుకున్న రైతులకు, ప్రైవేట్ కంపెనీలకు అందించడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఆశాజనకంగా దిగుబడులు



పరిశోధన స్థానం రూపొందించిన బ్లాక్ అండ్ రెడ్ రైస్ దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరానికి 30 బస్తాలకు తగ్గకుండా దిగుబడి లభిస్తుంది. 2023లో బ్లాక్ రైస్ విడుదల చేశాం. దీనిని అందరూ సాగు చేస్తున్నారు. రెడ్ రైస్ మినీ కిట్స్ ప్రక్రియ పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధంగా ఉంది. ఆరోగ్యానికి అత్యంత అనుకూలమైన రకాలుగా పరిశోధనలో తేలింది. రైతులు, ప్రైవేట్ కంపెనీలు, సాగు చేసుకునేందుకు విత్తనాలు ఇవ్వడం జరుగుతుంది.

- డాక్టర్ బీ కృష్ణవేణి, ప్రధాన శాస్త్రవేత్త, బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం



బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం

రోడ్డు ప్రమాదాలను 50శాతం తగ్గించాలి

● జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు

నరసరావు పేట రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలను 50 శాతం తగ్గించాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. జిల్లాలో సగటున నెలకు 50 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అత్యవసరంగా ప్రమాదాల సంఖ్య 25కి తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్, ఎస్పీ కంచి శ్రీనివాసరావు జిల్లా రహదారి భద్రత కమిటీ, మాదక ద్రవ్యాల నిరోధక సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2023, 2024లో జిల్లాలో వరసగా 576, 612, 2025 ఏప్రిల్ నాటికి 263 ప్రమాదాలు జరిగాయని గణాంకాలు వివరించారు. 2024లో 380 మంది మరణిం చగా.. ఈ ఏడాది నాలుగు నెలల్లో 152 మరణాలు సంభవించాయని తెలిపారు. ద్విచక్ర, భారీ వాహనాలు అత్యధిక ప్రమాదాలకు కారణమవుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో రహదారి భద్రతపై అవగాహన కల్పించాలని, రోడ్లపై నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రవాణ, పోలీసు శాఖల అధికారులు సమన్వయంతో జిల్లాలోని అన్ని రోడ్లపై తనిఖీలు నిర్వ హించాలని చెప్పారు. కాలేజీ విద్యార్థులు, రైతు కూలీలు పరిమి తికి మించి ఆటోలు, ట్రాక్టర్లలో ప్రయాణించడం ఎంత ప్రమాదమో వివరించాలని దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని 34 బ్లాక్ స్పాట్లలో ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు రోడ్డు ప్రమాదాల సరళిని మెరుగ్గా అంచనా వేయడంలో తోడ్పడుతున్నా యన్నారు. ప్రిస్కిప్షన్ లేని డ్రగ్స్ అమ్మకాలను నిరోధించండి

ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపుల్లో డ్రగ్స్ అమ్మకాలను నిరోధించాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై కళాశాలల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి కృష్ణప్రియ, ఆర్ అండ్ బీ ఎస్ఈ రాజా నాయక్, జిల్లా రవాణా అధికారి సంజీవ్ కుమార్, డీఎంహెచ్‌ఓ రవి, డీఈవో చంద్రకళ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు

ఐదు స్కానింగ్ కేంద్రాలకు అనుమతి

● ఆరు కేంద్రాల రద్దు

● ఇన్‌చార్జి కలెక్టర్ అధ్యక్షతన పీసీ పీఎన్‌డీటీ కమిటీ సమావేశం

గుంటూరు మెడికల్, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, వెల్లడిస్తే జైలు శిక్ష తప్పదని గుంటూరు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ తేజ హెచ్చరించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం (పీసీ పీఎన్‌డీటీ యాక్ట్)పై జరిగిన డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సలహా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి చట్టం గురించి, జిల్లాలో దాని అమలును వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ తేజ

ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ తేజ మాట్లాడుతూ జిల్లాలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ముందుగానే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుంచి అనుమతి పొందాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో కొత్తగా ఐదు స్కానింగ్ కేంద్రాల అనుమతులకు, ఆరు స్కానింగ్ కేంద్రాలు రద్దుకు, మరో 25 కేంద్రాలు మార్పుల కోసం దరఖాస్తు చేసుకున్నారని డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి తెలిపారు. వీటికి కలెక్టర్ ఆమోదం తెలిపారు. కృత్రిమ గర్భధారణ పద్ధతులపై వైద్య చికిత్సలు అందించే లెవెల్ 1 స్థాయిలో రెండు ఆసుపత్రులు, లెవెల్ 2 స్థాయికి ఒక ఆసుపత్రి దరఖాస్తు చేసుకున్నట్లు డీఎంహెచ్‌వో చెప్పగా, కలెక్టర్ ఆమోదించారు. సరోగసి కేంద్రం దరఖాస్తు గురించి చెప్పగా.. ఆ కేంద్రం పాత సరోగసి కేసులు వివరాలు ఆరోగ్య శాఖకు అందజేస్తే, పరిశీలించి అనుమతి మంజూరు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఆదేశించారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీడ్స్ డైరెక్టర్ డి.రోషన్ కుమార్, డాక్టర్ అనిత, డాక్టర ఆదిలక్ష్మి, డాక్టర్ రవీంద్ర నాయక్, డీపీఆర్‌వో శ్యామ్‌కుమార్, డెమో ఎ.జయప్రసాద్, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, వాణి, నిర్మల మేరి పాల్గొన్నారు.


వర్ష బీభత్సం..

◆ తడిచిన మొక్కజొన్న, పచ్చి ఇటుకలు ◆ అకాల వర్షాలతో తీవ్ర నష్టం



వర్షానికి తడిసిన మొక్కజొన్న గింజలు

కొల్లూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : మంగళవారం తెల్లవారుజామున వర్షం బీభత్సం సృష్టించింది. కొల్లూరు మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం నాలుగు గంటల పాటు ఏకధాటిగా కురిసింది. ఈ వర్షానికి మాగాణి పొలాల్లో ఆరబోసిన మొక్కజొన్న గింజలు పూర్తిగా తడిసిపోయాయి. లంక గ్రామాల్లో తుది దశకు వచ్చిన ఇటుక పరిశ్రమను వర్షాలు వెన్నాడటంతో పరిశ్రమదారులు తీవ్రంగా నష్టపోయారు. మంగళవారం కురిసిన వర్షం ధాటికి కల్లాల్లో ఆరబెట్టిన లక్షలాది పచ్చి ఇటుకలు ఎందుకు పనికి రాకుండా పోయాయి. ఎన్నడూ లేని విధంగా మే నెలలో అకాల వర్షాలు కురవడం వల్ల మొక్కజొన్న రైతులు, ఇటుక పరిశ్రమదారులు కోలుకోని విధంగా దెబ్బతిన్నారు. భారీ వర్షం ధాటికి రోడ్లు మొత్తం పూర్తిగా జలమయం అయ్యాయి. కొన్ని చోట్ల పల్లపు ప్రాంతాల్లోని గృహాలు సైతం వర్షపు నీరు చేరింది. మురుగు కాల్వలు పొంగి పొర్లడంతో మురుగు మొత్తం రోడ్లపైకి చేరి రోడ్లన్ని జుగుప్సాకరంగా మారాయి. పిడుగులు దాటికి కొన్ని గృహాల్లో ఎలక్ట్రానిక్ ఉపకరణాలు దెబ్బతిన్నాయి. ఈ ఏడాది మేలో వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటుందని భావించినప్పటికీ అకాల వర్షాలతో వర్షాకాలాన్ని తలపిస్తుంది. మరో రెండు రోజులు పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం.



తడిసి పోయిన పచ్చి ఇటుకలు

నల్లబర్లీని పూర్తిగా కొనుగోలు చేయాలి

• పలు మండలాల్లో రైతుల ధర్నాలు • తహసీల్దార్లకు వినతిపత్రాల అందజేత

పర్చూరు/కారంచేడు/పంగులూరు/మార్టూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన నల్లబర్లీ పొగాకు తక్షణమే కొనుగోలు చేయాలని రాష్ట్ర రైతుసంఘం పూర్వ ప్రధాన కార్యదర్శి నాగబోయిన రంగారావు డిమాండ్ చేశారు. నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం, కౌలు రైతుసంఘం ప్రతినిధులు స్థానిక రైతులతో కలసి పంగులూరు రెవెన్యూ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ బర్లీ సాగును ప్రోత్సహించిన కంపెనీలు కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. పొగాకు కంపెనీలు పూర్తిగా కొనుగోలు చేయాలని, లేకుంటే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ధర్నా శిబిరం వద్దకు వచ్చిన తహసీల్దార్ సింగారావు రైతుసంఘం ప్రతినిధులతో సమస్యను చర్చించారు. అనంతరం జీపీఐ కంపెనీ ప్రతినిధితో ఫోన్‌లో మాట్లాడి పొగాకు రైతుల ఇబ్బందిని గుర్తించి, కొనుగోలుకు చర్యలు చేపట్టాలని కోరారు. కంపెనీ ప్రతినిధితో నాగబోయిన రంగారావు మాట్లాడుతూ రైతులు పండించి నిల్వ ఉంచిన పొగాకు కంపెనీలు కొనుగోలు చేయాలని, పంగులూరు లేదా ఇంకొల్లులో కేంద్రంగా పొగాకు కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. బర్లీ పొగాకు 75 మిలియన్ కేజీలు ఉందని, అధికారిక లెక్కలు చెబుతుంటే, ప్రభుత్వం 20 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేయాలని కంపెనీలకు చెప్పడం విడ్డూరంగా ఉందని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్‌బాబు చెప్పారు. కంపెనీలు పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేలా ప్రభుత్వం కార్యాచరణ అమలుకు చర్యలు చేపట్టాలని కోరారు. నల్లబర్లీ పొగాకు కంపెనీల ద్వారాకాని, మర్క్‌ఫెడ్ ద్వారాకాని కొనుగోలు చేయాలని కోరుతూ తహసీల్దార్ సింగారావుకు వినతిపత్రం అందచేశారు. ధర్నా కార్యక్రమంలో జిల్లా రైతుసంఘం ప్రధాన కార్యదర్శి తలపనేని రామారావు, వినోద్, ఆదుంసాహెబ్, పంగులూరు పరిసర గ్రామాల రైతులు పాల్గొన్నారు.


పర్చూరులో రాస్తారోకో చేస్తున్న రైతులు


ధర్నాలో కంపెనీ ప్రతినిధితో మాట్లాడుతున్న నాగబోయిన

• యద్దనపూడి మండల తహసీల్దారు కె రవికుమార్‌కు రైతు సంఘం నాయకులు ఒక వినతిపత్రం అందజేశారు. పొగాకు కొనుగోలు చేయాలంటూ నిరసన తెలిపిన కార్యక్రమంలో బత్తుల హనుమంతరావు, ఈదల శ్రీను, వీరవల్లి కృష్ణ మూర్తి, వై హనుమంతరావు, వై శేషాద్రి పాల్గొన్నారు.

• పర్చూరు బొమ్మల సెంటర్‌లో పొగాకు కొనుగోళ్లపై నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి చింతలపూడి గంగయ్య, సీపీఎం నాయకులు మత్తే డేవిడ్, షేక్ రహీం, రైతులు పాల్గొన్నారు.

• కారంచేడులో రైతు సంఘం, కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్లబర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని రైతులతో కలసి ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండయ్య, పి.ఏడుకొండలు, శ్రీనివాసరావు, ఆవుల మంద వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

పొగాకు బోర్డు చైర్మన్‌తో ఎమ్మెల్యే ఏలూరి భేటీ

● మార్క్‌ఫెడ్ ద్వారా నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయండి ● ప్రభుత్వానికి నివేదక అందించిన సాంబశివరావు


బోర్డు చైర్మన్ యశ్వంత్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : టుబాకో బోర్డ్ చైర్మన్ సిహెచ్. యశ్వంత్‌తో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భేటీ అయ్యారు. నల్లబర్లీ పొగాకు రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కంపెనీలు కొనుగోలు చేయకపోవటంపై ఇటీవల ఎమ్మెల్యే ఏలూరి ఆ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో భేటి నిర్వహించి పొగాకు కంపెనీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అయినా కంపెనీలు పంట కొనుగోలు చేయకపోవటంతో ఎమ్మెల్యే ఏలూరి పట్టువిడవకుండా వివిధ మార్గాల ద్వారా కంపెనీలతో ప్రభుత్వం పై నుంచి ఒత్తిడి తీసుకువస్తున్నారు. పొగాకు సమస్యపై ఎమ్మెల్యే ఏలూరి ప్రభుత్వానికి ఒక ప్రత్యేక నివేదిక సైతం అందజేశారు. ఈఅంశంపై పంటల కొనుగోలుకు సంబంధించి మంత్రుల కేబినెట్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి

మార్క్‌ఫెడ్ ద్వారా నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి ప్రభుత్వాన్ని కోరారు. క్యాబినెట్ కమిటీ సమావేశంలో పొగాకు కొనుగోలుకు సంబంధించి కంపెనీలకు కొంత సమయం ఇచ్చి చూద్దామని, ఆ తర్వాత ఏమి చేయాలో నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి పేర్కొన్నట్లు తెలిసింది. పొగాకు రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఏలూరి తెలిపారు.

రాజంపల్లి సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

దర్శి, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజంపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దయింది. పంచాయతీ నిధులను నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేసినట్లు విచారణలో తేలటంతో సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజంపల్లి పంచాయతీలో నిధులను నిబంధనలకు విరుద్ధంగా మార్చుకున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. కనిగిరి డీఎల్‌పీవో హనుమంతరావు విచారణ జరిపి రూ.29.47 లక్షల నిధులు నిబంధనలకు విరుద్ధంగా మార్చుకున్నట్టు జిల్లా అధికారులకు నివేదిక ఇచ్చారు. కొన్ని పనులకు నిర్వాహకులకు బిల్లులు ఇవ్వకుండా తన కుమారుడి అకౌంట్‌లోకి నిధులు మళ్లించినట్లు డీఎల్‌పీవో పేర్కొన్నారు. నిధులు దుర్వినియోగం చేసినట్టు విచారణలో తేలటంతో సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేస్తూ డీపీవో ఉత్తర్వులు ఇచ్చినట్టు ఈవోఆర్డీ సుధాకర్ తెలిపారు.

బంగారు ఆభరణాల చోరీ కేసులో మహిళ అరెస్ట్

● 12.7 తులాలు రికవరీ

మార్కాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి) : బం గారు ఆభరణాలు ఉన్న బ్యాగును చోరీ చేసిన ఓ మహిళను మార్కాపురం టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి 12.7 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ పి.సుబ్బారావు చోరీ వివరాలను వెల్లడించారు. కొమరోలు మండల కేంద్రానికి చెందిన మజ్జారి బా లవెంకటయ్య కుటుంబసభ్యులతో కలిసి మార్కాపురం పట్టణంలో బంధువుల పెళ్లికి వెళ్లేందుకు ఈ నెల 18 సాయంత్రం ఆర్టీసీ బస్సులో ఎక్కారు. మార్కాపురం చేరిన వెంటనే వారితో తెచ్చుకున్న లగేజీని చూసుకోగా బంగారు ఆభరణాలు ఉన్న సంచి కనిపించలేదు. దీంతో అప్రమత్తమైన ఆయన పోలీ స్స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన ఎస్సైలు సైదుబా బు, రాజమోహన్ రావు అన్ని కోణాల్లో వెదుకులాట ప్రారంభించారు. కంభం బస్టాండ్ వద్ద వారితో ప్రయాణించిన ఒక జంట దిగినట్లు నిర్ధారించుకున్న పోలీసులు ఆ దిశగా విచారించారు. సీసీ పుటేజీల్లో ఒక జంట బాధితుల కు చెందిన బ్యాగుతో కంభం బస్టాండ్‌లో దిగినట్లు గుర్తించారు. బ్యాగును దొంగిలించిన మహిళ కోసం గాలించగా జగదీశ్వరి థియేటర్ ప్రాంతంలో నివాసముంటున్న దూదేకుల హుసేన్ బీగా గుర్తించారు. మంగళవారం ఆమె ఇంటికి వెళ్లి దొంగిలించిన సొత్తును రికవరీ చేశారు. కేసును ఛేదించిన పట్టణ పోలీసులను ఎస్పీ ఏఆర్.దామోదర్ అభినందించి రివార్డ్‌ను అందజేసినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించిన ఫ్యాప్టో ప్రతినిధులు

అద్దంకిటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో నాయకులు చర్చించారు. మంగళవారం ఏపీటీఎఫ్ మండల శాఖ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో అసంబద్ధ నిర్ణయాలకు వ్యతిరేకంగా చేపట్టబోయే ధర్నా కార్యక్రమం గురించి సంఘ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణతోపాటు తొమ్మిది రకాల పాఠశాలల ఏర్పాటుకు వ్యతిరేకంగా, ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మీడియం మాధ్యమాన్ని కొనసాగించాలని, మెడల్ ప్రైమరీ పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా ఎస్‌జీటీలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని, ఉన్నత పాఠశాలలో అదనపు సెక్షన్‌ను 45కు ఇవ్వాలని, ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై 21న ఒంగోలులోని డీఈవో కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలాది నాగరాజు, జె. బాబురావు, మల్లికార్జునరావు, రామారావు, పూర్ణచంద్రరావు, ఎలీషా, అంకయ్య, సుబ్బారావు, రవిచంద్ర, కోటేశ్వరరావు, రాఘవయ్య, రాజశేఖర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


సమావేశమైన ఫ్యాప్టో నాయకులు

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు కనీస వేతనాలు ఇవ్వాలి

● యూనియన్ నాయకుల డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి) : తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల డ్రైవర్లుగా పనిచే స్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని ప లువురు కోరారు. ఏపీ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లా యీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు జీవీ.కొండారెడ్డి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లాకార్యదర్శి పెం ట్యాల కల్పన ధర్నాకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ కేవలం రూ.7,870 వేతనంతో గత తొమ్మిదేళ్లుగా పని చేస్తున్న వాహనడ్రైవర్లకు కనీస వేతనాలు అ మలు చేయడం లేదన్నారు. వైద్యఆరోగ్యశాఖలో నిరంతరం పనిచేస్తున్న వాహన డ్రైవర్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానం పేరుతో వెట్టిచాకిరి చేపిస్తున్నారని మండిపడ్డారు. కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటి వెంకటేశ్వర్లు, నాయకులు భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న డ్రైవర్లు

టీచర్ల సంఘాలతో చర్చలు సఫలం

నేటి డీఈవో కార్యాలయ ముట్టడి వాయిదా

ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్

ఒంగోలు విద్య, మే 20 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల పునర్వ్యవస్థీకరణ, టీచర్ల కేటాయింపు, బదిలీలకు సంబంధించి వివిధ అంశాలపై ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. సోమ, మంగళవారాల్లో విద్యాశాఖ కార్యదర్శి జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. దీంతో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన డీఈవో కార్యాలయ ముట్టడిని తాత్కాలికంగా వాయిదా వేశారు. మొత్తం 15 డిమాండ్లతో టీచర్ల సంఘాలు చర్చలకు వెళ్లగా మెజార్టీ డిమాండ్లకు అధికారుల స్థాయిలోనే పరిష్కారం లభించడంతో ఆందోళనను విరమించారు. టీచర్ల బదిలీలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఐక్యవేదిక నాయకుల డిమాండ్ మేరకు సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలను ఆన్‌లైన్‌కు బదులుగా మాన్యువల్‌గా నిర్వహించేందుకు అధికారులు అంగీకరించారు. ప్రభుత్వానికి, నాయకుల మధ్య అంగీకారం కుదరడంతో బుధవారం బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేసేందుకు సిద్ధం చేశారు. ఆమోదించిన డిమాండ్లు ఇవీ.

• రేషనలైజేషన్‌లో సీనియర్ టీచర్ తప్పనిసరి అయితే రేషనలైజేషన్ పాయింట్లు ఇస్తారు.

• హైస్కూళ్లలో ఒక తరగతిలో విద్యార్థుల సంఖ్య 49 దాటితే రెండవ సెక్షన్ ఇస్తారు

• పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియానికి సమాంతరంగా తెలుగు మీడియంను కొనసాగించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతారు

• ఉన్నత పాఠశాలల్లోని ప్రాథమిక పాఠశాలలను సపరేట్‌గానే పరిగణిస్తారు.

• హైస్కూళ్లలో వారానికి 32 పీరియడ్ల పనిభారం పెరగకుండా చూస్తారు

• ప్రస్తుతం స్టడీ లీవ్‌లో ఉండి ఆగస్టు 31లోపు జాయిన్ అయ్యే వారి స్థానాలను ఖాళీలుగా చూపించరు

• బదిలీలకు అన్ని ఖాళీ పోస్టులు చూపిస్తారు

• మోడల్ ప్రైమరీ స్కూళ్లను పీఎస్ హెచ్ఎంలుగా 1,382 మంది ఎస్జీటీలకు పీఎస్ హెచ్ఎంలుగా ప్రమోషన్ ఇస్తారు

• మోడల్ ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థులు 120 మంది దాటితే అదనంగా మరో ఎస్జీటీ పోస్టు ఇస్తారు.

• రెండుసార్లు పునర్విభజనకు గురైన టీచర్లకు 7 పాయింట్లు ఇస్తారు

• ఇతర మేనేజ్‌మెంట్లలో ఒక పాఠశాలలో ఎనిమిదేళ్లు పూర్తిచేసిన టీచర్లు తమ సొంత మేనేజ్‌మెంట్ స్కూళ్లకు వెళ్లాలి.

• ఫౌండేషన్ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య 20 దాటితే 2వ పోస్టుల ఇస్తారు.

• ఐక్యవేదిక నాయకులతో కుదిరిన ఒప్పందం మేరకు ప్రభుత్వం బదిలీల మార్గదర్శకాల్లో సవరణలు చేస్తూ ఉత్తర్వులు జారీచేయాల్సి ఉంది.



వ్యక్తి అదృశ్యంపై కేసు

మద్దిపాడు, మే 20(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం లింగంగుంట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చినట్లు ఎస్సై శివరామయ్య తెలిపారు. షేక్ కరీముల్లా గత 16 సంవత్సరాలుగా మతిస్థిమితం లేకుండా ఇంటి నుంచి అప్పుడప్పుడు వెళ్లి కొద్దిరోజుల తర్వాత ఇంటికి తిరిగి వస్తూ ఉండేవారని, ఇదేక్రమంలో 2024 ఆగస్టులో బయటకు వెళ్లిన అతను ఇంతవరకు తిరిగి రాలేదని ఆయన భార్య షేక్ మొగల్‌జాన్‌బి ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శివరామయ్య వెల్లడించారు.

ఇరువురికి గాయాలు

మద్దిపాడు, మే 20(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలైన సంఘటన మంగళవారం ఏడుగుండ్లపాడు వద్ద జరిగింది. మార్టూరుకు చెందిన పంతంగి శ్రీనివాసరావు, పంతంగి ఏడుకొండలు బైక్‌పై ఒంగోలు వెళ్లి తిరిగి వస్తుండగా ఒక్కసారిగా టిప్పర్ అడ్డువచ్చింది. దీంతో బైక్ అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొనడంతో వారికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

అవీఇవీ

అరబిందో నుంచి భవ్యకు 108 వాహనాలు అప్పగింత

చీరాలలో వాహనాలను పరిశీలించిన ప్రతినిధులు


108 వాహనంలో పరికరాలు పరిశీలిస్తున్న భవ్య సంస్థ ప్రతినిధులు

చీరాల, మే 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా అరబిందో సంస్థ నుంచి బీహెచ్ఎస్‌పీఎల్(భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్) సంస్థకు 108, 104 వాహనాల నిర్వహణ బాధ్యతలను మళ్లిస్తున్నారు. ఈక్రమంలో ఇప్పటికే అందుకు సంబంధించిన ఒప్పందాలు కూడా జరిగాయి. బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న 25 వాహనాలు, 1 నియోనటల్(చిన్నారులకు సంబంధించిన) వాహనం, అదనపు 108 వాహనం మొత్తం 27 వాహనాలపై అధికారులు ఆడిట్ చేస్తున్నారు. ఈక్రమంలోనే మంగళవారం చీరాల ఏరియా హాస్పిటల్ పరిధిలో వాహనాన్ని పరిశీలించారు. వాహనం పని తీరు, అందుబాటులో ఉన్న పరికరాలను తనిఖీ చేశారు. బండి కండిషన్ చెక్ చేశారు. సిబ్బంది యథా స్థానాల్లో పని చేస్తారని అందుకు సంబంధించి ప్రత్యేక ప్రణాళిక చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా అందుబాటులో ఉన్న 104 వాహనాలు 33ను ఈనెల 16నుండే భవ్య సంస్థ స్వాధీనం చేసుకుంది. ఈ కార్యక్రమంలో 108 జిల్లా మేనేజర్ బాలకృష్ణ, 104 జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ అశోక్, పైలట్‌లు, ఈఎంటీలు పాల్గొన్నారు.

పీఎంజేఏవైతో నగదు రహిత వైద్య సేవలు


పీఎంజేఏవై కార్డులు నమోదు చేస్తున్న వైద్యాధికారి

చినగంజాం, మే 20(ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజనతో దేశంలో ఎక్కడైనా నగదు రహిత ఆరోగ్య సేవలు పొందవచ్చునని సంతరావూరు పీహెచ్‌సీ వైద్యాధికారి కే కీర్తిసరోజ్, జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ సీహెచ్ ప్రవీణ్‌కుమార్‌లు చెప్పారు. మండలంలోని సంతరావూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జరిగిన ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన కార్డుల ఆన్‌లైన్ నమోదు కార్యక్రమంలో వారు మాట్లాడారు. పేదప్రజలు పీఎంజేఏవై కార్డులను సద్వినియోగం చేసుకొని ఐదు లక్షల రూపాయిల వరకు కార్పొరేటు వైద్యశాలలో వైద్యసేవలు పొందవచ్చునని చెప్పారు. 500 మందికి ఆన్‌లైన్‌లో పీఎంజేఏవై కార్డులను నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కే కృపారావు, పీహెచ్‌సీ హెచ్ఈవో వెంకటరమణ, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీధర్, మాధవి, వరదానం, హెల్త్ అసిస్టెంట్ జి.వి.జయప్రసన్న, ఏఎన్ఎంలు శారద, శాంతి, సునీత, యశోద, శిరీష పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు, హద్దురాళ్లు ఏర్పాటు


హద్దు రాళ్లు వేస్తున్న గ్రంథాలయ సంస్థ అధికారులు

అద్దంకి, మే 20 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలో గ్రంథాలయం భవనం నిర్మాణానికి ఇటీవల రెవెన్యూ అధికారులు 10 సెంట్లు స్థలం కేటాయించారు. ఎన్ఎస్‌పీ కార్యాలయం ఆవరణలో స్థలం కేటాయించగా మంగళవారం రెవెన్యూ గ్రంథాలయ సంస్థల అధికారులు, ఎన్ఎస్‌పీ సిబ్బంది సమక్షంలో హద్దురాళ్లు వేశారు. గ్రంథాలయం భవనానికి స్థలం కేటాయింపునకు సహకరించిన విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు గ్రంథాలయ సంస్థ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ కాసు ఆదిలక్ష్మీ, రిటైర్డ్ లైబ్రరీయన్ సుగుణరావు, వసుంధర దేవి, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మన్నం త్రిమూర్తులు, దివాకర్‌దత్తు, రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ దేవపాలన, రిటైర్డ్ డిప్యూటి కలెక్టర్ పల్లెపాటి పేరయ్య, జ్యోతి చంద్రమౌళి, గోవాడ శ్రీకాంత్, చెన్నుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మహానాడు నిర్వహణలో కీలక బాధ్యతలు

పలు కమిటీల్లో జిల్లా నేతలకు స్థానం

మంత్రి స్వామి కన్వీనర్‌గా రక్తదాన, మెడికల్ క్యాంపు కమిటీ

ఒంగోలు మే 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులో కడపలో జరగనున్న టీడీపీ మహానాడు నిర్వహణలో జిల్లాకు చెందిన పలువురు నేతలకు కీలక బాధ్యతలను అధిష్ఠానం అప్పగించింది. ఈనెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు కడప నగర శివారులో టీడీపీ మహానాడు జరగనుంది. భారీగా దానిని నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయించి తదనుగుణ ఏర్పాట్లను అధిష్ఠానం పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ఈక్రమంలో మహానాడు విజయవంతం కోసం 19 కమిటీలను నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నేతలను ఆ కమిటీల్లో నియమించారు. అందులో పలు కమిటీల్లో జిల్లాకు చెందిన ముఖ్య నాయకులను నియమించారు. మొత్తం 19 కమిటీలకు ఒక్కొక్క కమిటీకి ఒక రాష్ట్ర స్థాయి ముఖ్యనేత కన్వీనర్‌గా అవసరాన్ని బట్టి ఒకరిద్దరు కోకన్వీనర్‌లుగా పలువురు నాయకులను సభ్యులుగా నియమించారు. అందులో వైద్యులు ప్రధానంగా నడిపించే రక్తదాన, మెడికల్ క్యాంపుల కమిటీకి కన్వీనర్‌గా జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామిని నియమించారు. అలాగే వైద్యులైన కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, దర్శి ఇన్‌చార్జీ గొట్టిపాటి లక్ష్మీలను సభ్యులుగా నియమించారు. అలాగే అత్యంత కీలకమైన తీర్మానాల కమిటీలోనూ మంత్రి డాక్టర్ స్వామిని నియమించారు. మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు కన్వీనర్‌గా ఉన్న వసతి ఏర్పాట్ల కమిటీకి జిల్లాకు చెందిన యువ నేత మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణను కోకన్వీనర్‌గా నియమించారు. అలాగే భోజనాల ఏర్పాట్ల కమిటీలోనూ సభ్యునిగా సత్య ఉన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మరో ప్రధానమైన ఆర్థిక వనరుల కమిటీలో సభ్యునిగా నియమించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ కన్వీనర్‌గా జన సమీకరణ కమిటీ ఏర్పాటు చేయగా అందులో సభ్యులుగా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముత్తుముల అశోక్‌రెడ్డిలను నియమించారు. సాంస్కృతిక వ్యవహారాల కమిటీలో ఒంగోలుకు చెందిన రాష్ట్ర కల్చరల్ కమిషన్ చైర్మన్ పొడపాటి తేజశ్విని నియమించారు. ఆయా కమిటీ సభ్యులు అన్ని జిల్లాల పార్టీ నేతలతో సమన్వయం చేసుకొని మహానాడు విజయవంతంగా జరగడానికి కృషిచేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సూచించారు.

108 కలశాల జలంతో అభిషేకం




కలశాలతో దేవాలయం వద్ద ప్రదక్షిణ చేస్తున్న ఈవో తిమ్మానాయుడు, మహిళలు, రాతి మండపం దాతలను సత్కరిస్తున్న ఈవో, పూజారులు

శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం విమాన శిఖరానికి పూజలు

రాతి మండపం నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన దాతలకు సత్కారం

అద్దంకి, మే 20 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం విమాన శిఖరానికి మంగళవారం 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. సోమవారం మహాకుంభాభిషేకం జరగగా మంగళవారం ఈవో తిమ్మానాయుడు, రిషిత దంపతులు 108 మంది మహిళలతో కలిసి ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం చుట్టూ ప్రదక్షణ చేశారు. అనంతరం విమాన శిఖరానికి అభిషేకంచేశారు. కలశయాత్రలో పాల్గొన్న పలువురు మహిళలు మంగళవారం విమాన శిఖరం జలాభిషేకంలో పాల్గొన్నారు. ప్రసన్నాంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. రాతి మండపం నిర్మాణానికి సుమారు 130 మంది లక్ష రూపాయలకు పైగా విరాళాలు అందజేయగా మంగళవారం 70 మంది దాతల కుటుంబాలకు స్వామి దేవాలయంలో ప్రత్యేక దర్శనం, పూజలు నిర్వహింపచేసి అనంతరం సత్కరించి, స్వామి ఫొటో అందజేశారు. మహాకుంభాభిషేకం పూర్తయిన తరువాత మొదటి మంగళవారం కావటంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.



ప్రసన్నాంజనేయస్వామి

అంగరంగ వైభవంగా స్వర్ణమ్మ తల్లి తిరునాళ్ల

స్వర్ణ(పర్చూరు), మే 20 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో వేంచేసియున్న గ్రామ దేవత స్వర్ణమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసేందుకు ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి రావటంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. గ్రామంలో వెలసిన స్వర్ణమ్మ తల్లికి వెయ్యేళ్ల చరిత్ర ఉందని గ్రామ పూర్వీకులు చెబుతున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ అధికారులు, కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కారంచేడు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.




ప్రత్యేక అలంకరణలో స్వర్ణమ్మతల్లి అమ్మవారు



ఆలయాన్ని వివిధ రకాల పూలతో అలంకరించిన దృశ్యం

రేపు వీరాంజనేయస్వామి 38వ తిరునాళ్లు

మార్టూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో బొబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామాల మధ్య కొండపై వేంచేసి ఉన్న శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారి 38వ తిరునాళ్ల మహోత్సవాలను గురువారం నిర్వహించనున్నట్లు దేవస్థానం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దండా వీరాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానంలో సోమవారం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అదేవిధంగా మంగళవారం ఉదయం భక్త సమాజం వారిచే అఖండ హరేరామనామ సంకీర్తన ఏకాహం నిర్వహించారు. బుధవారం ఉదయం శ్రీహనుమాన్ చాలీసా పారాయణం చేయనున్నారు. ఇక చివరిరోజు గురువారం శ్రీసువర్చలా సహిత వీరాంజనేయస్వామి కల్యాణ మహోత్సవం, అనంతరం అన్నదానం నిర్వహిస్తారు. సాయంత్రం ఎడ్ల బలప్రదర్శన, కోలాటం ప్రదర్శన తదితర సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేసినట్లు దండా వీరాంజనేయులు తెలిపారు.



అలంకరణలో శ్రీవీరాంజనేయస్వామి విగ్రహం



కొణిదెనలో ఉన్న రామలింగేశ్వర స్వామి దేవాలయం

నేడు రామలింగేశ్వర స్వామి తిరునాళ్ల

బల్లికురవ, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణిదెన గ్రామంలో వేంచేసి ఉన్న రామలింగశ్వరస్వామి 16వ వార్షిక తిరునాళ్ల బుధవారం జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామస్థులు విద్యుత్ ప్రభను ఏర్పాటు చేస్తున్నారని, దేవాలయ కమిటీ తరఫున అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు కోరారు.

అందరికీ ఆదర్శనీయులు ఆంధ్రకేసరి



నివాళులర్పిస్తున్న పలు సంఘాల ప్రతినిధులు

అద్దంకిటౌన్, మే 20(ఆంధ్రజ్యోతి) : నిస్వార్థ దేశభక్తిని, త్యాగనిరతిని ధైర్య సాహసాలు కలిగి అందరికీ ఆదర్శనీయులు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని ప్రకాశం పంతులు మునిమనుమరాలు సుభాషిణి చెప్పారు. మంగళవారం టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతి కార్యక్రమం అద్దంకిలోని ప్రకాశం మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బంగ్లారోడ్డులోని టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భాష్యం స్కూల్‌లో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులుతో తనకు ఉన్న అనుబంధాన్ని, చేసిన సేవలను సుభాషిణి వివరించారు. ఈ కార్యక్రమంలో మిత్రమండలి కార్యదర్శి షేక్ మహమ్మద్ రఫీ, కోశాధికారి ఊటుకూరి రామకోటేశ్వరరావు, గాడేపల్లి దివాకర్‌దత్తు, వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య) తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి తగ్గించుకోవాలి

పంగులూరు, మే 20(ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ఒత్తిడి తగ్గించుకోవాలని హైదరాబాద్‌కు చెందిన నిమ్స్ వైద్యశాల ఫిజియో థెరపిస్ట్ వెంకటరమణ చెప్పారు. పంగులూరు మండల కార్యాలయంలో మంగళవారం వివిధ శాఖల ఉద్యోగులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు చిట్కాలు, సూచనలు తెలియజేశారు. ఎంపీడీవో స్వరూపారాణి, ఈవోఆర్డీ సుమంత్, సూపరింటెండెంట్ రమేష్, పంచాయితీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వెంకటరమణ

అటు మద్రాసోళ్లు.. ఇటు లైసెన్స్ లేనోళ్లు...!

చీరాల సముద్ర తీరంలో నిషేధ కాలంలో అక్రమంగా చేపల వేట

భవిష్యత్తులో మత్స్య సంపద వృద్ధికి శరాఘాతం

నామమాత్రంగా అధికారుల తనిఖీలు

చర్యలు తీసుకోవాలని వినతులు



వాడరేవు సముద్రతీరం

చీరాల, మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం తీరంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు నిషేధాజ్ఞలు ఉన్నాయి. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు మత్స్య సంపద వృద్ధి చెందే సమయం కావడంతో ఈ సమయంలో మత్స్యకారులు వేటను నిలుపుదల చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. జిల్లాలో సుమారు 75 కిలోమీటర్లు తీరం ఉండగా, అందులో వేట సాగిస్తూ జీవనం గడుపుతున్న మత్స్యకార కుటుంబాలు వేల సంఖ్యలో ఉన్నాయి.

సుమారు 40 మంది అనధికార వేట

మత్స్య సంపద వేటతో జీవనాధారం సాగిస్తున్న వారి పరిస్థితి ప్రస్తుతం అయోమయంలో పడింది. అప్పుడప్పుడు అకస్మాత్తుగా మద్రాసీయులకు చెందిన ట్రావెలర్ బోట్లు ఆంధ్రా పరిధిలోని తీరంలో అనధికారంగా చొరబడి వేట సాగిస్తున్నారు. ఈ క్రమంలో గతంలో గుర్తించి నిలదీసిన మత్స్యకారులపై దాడులకు పాల్పడటమే కాకుండా వలల కూడా లాక్కెళ్లిన ఉదంతాలు తెలిసిందే. దీంతో స్థానిక మత్స్యకార సంఘాల నాయకులు ఇటీవల రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను కలిసి వినతి అందజేశారు. ఈనేపథ్యంలో హోం మంత్రి విషయాన్ని సంబంధిత అధికారులకు సూచనలు కూడా చేశారు. తాజాగా స్థానికంగా లైసెన్స్‌లు లేని మోటారు బోటు మత్స్యకారులు సైతం తామేం తక్కువ కాదంటూ ఇష్టారీతిగా తీరంలోకి చొరబడి అక్రమంగా వేట సాగిస్తున్నారు. ఈ తరహా బోట్లు సుమారు 40 మంది తీరంలోకి వెళుతున్నట్లు సమాచారం. అసలే సంధి కాలం, పైగా అనధికార బోట్లు.. అయినా కూడా విచ్చలవిడిగా వేట సాగిస్తున్నారు. దీంతో ఆగ్రహించిన మత్స్యకార సంఘాల నాయకులు సీఎంవోకు ఫిర్యాదు చేయడంతో అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. అనధికార వేటను గుర్తించారు. వారికి పలు హెచ్చరికలు జారీ చేశారు. ఇలా అక్రమంగా చేపల వేట వల్ల సముద్రంలో మత్స్య సంపద వృద్ధికి పెనుముప్పు వాటిల్లింది.



మద్రాసీయులు అనధికారంగా పరిధి దాటి వేట(ఫైల్)

తనిఖీలు నామమాత్రమే

ఫిర్యాదులు చేస్తేనే అధికారులు తనిఖీలకు వస్తున్నారు గానీ, పర్యవేక్షణలోపం ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. వేట సంధికాలం నుంచి వేట సాగిస్తున్నా అధికారులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని విమర్శలు ఉన్నాయి. ఈ విధంగా మద్రాసీయులు ఒకవైపు, అనధికార లైసెన్సీయులు మరోవైపు వేట సాగిస్తే సంపద వృద్ధి చెందక భవిష్యత్తులో వేట సాగక ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని మత్స్యకారులు విలపిస్తున్నారు.

నేడు అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

పర్చూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులోని వైజంక్షన్‌లో వేంచేసిన శ్రీ అభయాంజనేయస్వామి 92అడుగుల విగ్రహ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఈనెల 22వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

గుర్తింపు కార్డు ఉన్న కౌలు రైతులకే ప్రభుత్వ పథకాలు

పంగులూరు, మే 20(ఆంధ్రజ్యోతి) : కౌలు రైతు గుర్తింపు కార్డుదారులకే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని తహసీల్దార్ పి.సింగారావు చెప్పారు. మండలంలోని అలవలపాడు, తూర్పుతక్కెళ్లపాడు గ్రామాలలో మంగళవారం కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్వో సుధాకర్, వీవోఏ ఫిలిప్, సునీత, రైతులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని సిబ్బంది



చందలూరులో తెరుచుకోని రైతు సేవాకేంద్రం తలుపులు

పంగులూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు సచివాలయం పరిధిలో రైతు సేవాకేంద్రం సిబ్బంది సమయపాలన పాటించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం రైతులకు అందించే అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి తమ పేర్లు రెన్యూవల్ చేసుకునేందుకు తాము మంగళవారం కార్యాలయానికి చేరుకున్నా 10.55 వరకు తలుపుల తెరుచుకోలేదని రైతులు తెలిపారు. రైతు సేవాకేంద్ర సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటించేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రూఫ్ టాప్ సోలార్‌పై అవగాహన కల్పించాలి

బల్లికురవ, మే 20 (ఆంధ్రజ్యోతి) : గృహాలలో రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో కె.కుసుమకుమారి చెప్పారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజనపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి ఇంటికీ సోలార్‌ను ఏర్పాటు చేసేలా రాయితీలు ఇస్తోందని, అలానే ప్రజలకు బ్యాంకు ద్వారా రుణాలను కూడా ఇస్తున్నారని చెప్పారు. ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటికీ మూడు వందల యూనిట్ల విద్యుత్‌ను తయారు చేసేలా ఈ పథకం పని చేస్తుందని తెలిపారు.

దాడికి పాల్పడిన వారిని గుర్తించిన పోలీసులు

ఈపూరుపాలెం(చీరాల), మే 20 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు సముద్ర తీరంలో కుటుంబ సభ్యులతో స్నానాలు చేస్తున్న వారిని ఇటీవల కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఈవ్‌టీజింగ్ చేసిన విషయం పాఠకులకు విదితమే. వారిని నిలదీసిన వ్యక్తిపై కూడా వారు దాడికి పాల్పడ్డారు. ఈక్రమంలో ఈపూరుపాలెంలో నమోదైన కేసులో పోలీసులు పురోగతి సాధించారు. అల్లరి మూకలు చిలకలూరిపేటకు చెందిన వారుగా గుర్తించారు. వారిని స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేయగా స్థానికుల పూచికత్తుతో బుధవారం వచ్చేవిధంగా ఒప్పందం కుదిరినట్లు తెలిసింది.

అవీఇవీ

హైవేపై కారు బోల్తా.. ఒకరు మృతి



జాతీయ రహదారిలో బోల్తా పడిన కారు

మేదరమెట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్ల జాతీయ రహదారిపై తిరుమల వెళ్లి వస్తున్న కారు వేగం అదుపు కాక రోడ్డు మార్జిన్‌లో బోల్తా పడింది. మంగళవారం ఉదయం ఏలూరు జిల్లా దెందులూరు మండలం కోవల్లి గ్రామానికి ఏడుగురు తిరుపతికి వెళ్లి తిరిగి వస్తూ మేదరమెట్ల ఫ్లైఓవర్ దాటాకా కారు వేగం అదుపు కాకా రోడ్డు మార్జిన్‌లో బోల్తాపడింది. కారులోని సుంకర నాగరాజు(21) అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్ పూజారా లక్ష్మణరావు, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్‌ఐ షేక్ మహమ్మద్ రఫీ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

యద్దనపూడి/మార్టూరు మే 20 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం యనమదల గ్రామంలో మేడిశెట్టి సుబ్బాయమ్మ(60) అనే మహిళ విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందింది. మృతురాలికి భర్త యలమంద, ఒక కుమారుడు రాంబాబు ఉన్నారు. ఆమె భర్త, కుమారుడు, కోడలుతో కలిసి యనమదల గ్రామంలో ఒక రైస్ మిల్లును నడుపుతున్నారు. అదేవిధంగా ఉదయం మిల్లు నుంచి బయటకు వచ్చిన ఆమె కాలకృత్యాలకు ఒక ఇంటి ప్రహరీ పక్క నుంచి వెళుతూ అక్కడ ఉన్న ఇనుపరాడ్‌ను పట్టుకోగా విద్యుత్ రావడంతో షాక్‌కు గురై అక్కడకక్కడే చనిపోయింది. ఈ ప్రమాదంపై కుమారుడు రాంబాబు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై రత్నకుమారి సంఘటనా స్థలానికి వచ్చి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వాస్తవంగా యద్దనపూడి మండలం కటావారిపాలేనికి చెందిన సుబ్బాయమ్మ కుటుంబం ఎనిమిదేళ్ల క్రితం యనమదల గ్రామానికి వచ్చి ఒక రైస్‌మిల్లును అద్దెకు తీసుకొని నడుపుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల భారంతో వ్యక్తి బలవన్మరణం



బాలకృష్ణ(ఫైల్)

వేటపాలెం/చీరాల, మే 20 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసగా మారి వ్యక్తి బలవన్మరణం చెందిన సంఘటన మంగళవారం వేటపాలెం మండల పరిధిలోని కొత్తపేట టైలర్స్ కాలనీలో చోటుచేసుకుంది. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాలనీకు చెందిన బాలకృష్ణ(40) అప్పుడప్పుడు సోడా బండి నిర్వహిస్తూ ఈపూరుపాలెంలో ఓ టిఫిన్ హోటల్లో పనిచేస్తుంటాడు. ఇతనికి భార్య ధనలక్ష్మీ ఇరువురు కుమారులు ఉన్నారు. ఇటీవల ఇతను మద్యానికి బానిసగా మారాడు. ఈక్రమంలోనే అప్పుల పాలయ్యాడు. దీంతో ఇంటిని అమ్మాలని భార్యను అడగడంతో మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరికి పాల్పడి బలవన్మరణం చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బాలిక మెడలో బంగారు గొలుసు అపహరణ

అద్దంకిలో ఇంటి ముందు పూలు కోస్తుండగా ఘటన

పెంపుడు కుక్క వెంబడించి కరిచినా పారిపోయిన దొంగ

అద్దంకి, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు మొక్కల పూలు కోస్తున్న బాలిక మెడలో బంగారం గొలుసు అపహరించిన సంఘటన మంగళవారం అద్దంకి పట్టణంలోని వాసవీనగర్‌లో విశ్వభారతీ స్కూల్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు... గునుపూడి నరేంద్ర కుమార్తె యశస్విని మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో ఇంటి ముందు పూలు కోస్తుండగా గుర్తుతెలియని యువకుడు స్కూటీపై వచ్చి అదే రోడ్డులో ముందుకు వెళ్లాడు. వెనువెంటనే వెనుతిరిగి వచ్చి బాలిక మెడలో సుమారు 10 గ్రాముల బంగారం గొలుసును లాక్కొని వెళ్లాడు. బాలిక కేకలు వేయటంతో ఇంటిలో ఉన్న కుక్క వచ్చి దొంగను వెంబడించి కరిచింది. అయినా తప్పించుకొని వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న సీఐ సుబ్బరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగ పాత నేరస్థుడుగా అనుమానిస్తున్నారు. చోరీకి పాల్పడిన యువకుడు వివరాలను పోలీసులు సేకరించినట్లు తెలుస్తుంది.

రైల్వే గేటును ఢీకొన్న లారీ



గేటును పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

చీరాల, మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు లారీ రైల్వే గేటును ఢీకొంది. ఈఘటన మంగళవారం ఉదయం పేరాల సమీపంలోని కారంచేడు రైల్వే గేటు వద్ద చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం... పర్చూరు వైపు నుంచి చీరాల వస్తున్న లారీ అదుపు తప్పి గేటును ఢీకొంది. ప్రమాదంలో గేటు దెబ్బతినడంతో సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికిచేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



నిరసన చేస్తున్న వివిధ సంఘాల కార్మికులు

అద్దంకిటౌన్, మే 20(ఆంధ్రజ్యోతి) : సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్త కార్మిక సంఘాల పిలుపులో భాగంగా అద్దంకిలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం బంగ్లారోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి నిరసన ర్యాలీ నిర్వహించారు. పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా కార్మికులను పెంచాలని, చనిపోయిన కార్మికులకు రూ.20 వేలు మట్టి ఖర్చుల కింద ప్రభుత్వం అందజేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ శ్రీదేవికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదాం, బిష్మా, శామ్యూల్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండండి

అద్దంకిటౌన్, మే 20(ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలతోపాటపాటు మోస్తరు వర్షాలు కురుస్తాయని మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఈవోఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. గ్రామాల్లో ఎక్కడా వర్షపు నీరు నిలువకుండా మురుగు కాలువలు శుభ్రం చేయాలని, లోతట్టు ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పారిశుధ్యం సమస్యలు తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టాలని వివరించారు.